
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 22 ఆగస్టు 2024 | 5



అచ్యుతాపురం సెజ్ ఘటనలో కాకినాడ యువతి మృతి



సర్పవరం జంక్షన్, ఆగస్టు 21: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో కాకినాడ యువతి మృతిచెందింది. కాకినాడ 2వ డివిజన్ సౌజన్యనగర్‌కు చెందిన చల్లపల్లి హారిక (22) ఫ్యాక్టరీలో కెమిస్ట్‌గా పనిచేస్తోంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం కాకినాడ వచ్చి పెదనాన్న కుమారులకు రాఖీ కట్టి ఆనందంగా గడిపింది. బుధవారం తెల్లవారుజామున కాకినాడ నుంచి బయలుదేరి అచ్యుతాపురం వెళ్లింది. విధి నిర్వహణలో ఉండగా రియాక్టర్ పేలిన దుర్ఘటనలో హారిక మృతిచెందిందన్న వార్త విన్న తల్లి అన్నపూర్ణ, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఐదు పాఠశాలలకు ఎక్సలెన్స్ అవార్డు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 21 : క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఐదు స్కూళ్లను స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపిక చేశారు. దేవరపల్లి మండలం పల్లంట్ల ఎస్‌ఈఎస్‌పీఆర్‌ఆర్ జడ్పీ హైస్కూల్ (157 పాయింట్లు), రామన్నపాలెం జడ్పీ హైస్కూల్ (133 పాయింట్లు), చిన్నాయిగూడెం జడ్పీ హైస్కూల్ (113 పాయింట్లు), దేవరపల్లి ఏఎస్ఎస్ఆర్ జడ్పీ హైస్కూల్ (105 పాయింట్లు), బ్రాహ్మణగూడెం జడ్పీ హైస్కూల్ (75 పాయింట్లు)తో ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపికయ్యాయి. 2023-24లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన గేమ్స్ అండ్ స్పోర్ట్సులో క్రీడాకారులు కనబరచిన ప్రతిభ ఆధారంగా అవార్డులకు ఎంపిక చేసినట్టు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. పరిశీలకులుగా పీడీ ఏవీడీ ప్రసాద్, వి.సింహాద్రిరావు, సీహెచ్ సతీష్‌కుమార్ వ్యవహరించారు. ఆయా పాఠశాలలకు ఆగస్టు 29న రాష్ట్ర విద్యాశాఖ ద్వారా ఒక ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తారు.

25 నుంచి సామూహిక ఎలుకల నిర్మూలన

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 21 :జిల్లాలోని 18 మండలాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎలుకల నివారణ మందులు పంపిణీ చేస్తారని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ రైతులకు బ్రోమోడియోలిన్ మందు ఉచితంగా పంపిణీ చేసేందుకు జిల్లాకు 737 కిలోలు వచ్చిందన్నారు. ఈ మేరకు కలెక్టర్ కరపత్రాలు ఆవిష్కరించారు.

బడి పనులపై దృష్టి సారించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): 'మన బడి మన భవిష్యత్తు' పనుల పురోగతిలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని, పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. జిల్లాలోని 655 పాఠశాలల్లో జరుగుతున్న మన బడి మన భవిష్యత్తు పనులపై బుధవారం సమీక్షించారు. ఇంజనీరింగ్ పనులు పూర్తి చేయడానికి ఐదు శాఖల ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.96.33 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌కు రూ.77.95 కోట్ల చెల్లింపులు పూర్తయ్యాయన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. చేపట్టాల్సిన పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీడీ ఎస్.సుభాషిణి, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎండీ అలిముల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డీ.బాల శంకర్రావు, డీఈవో కె.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 : జిల్లాలో ప్రభుత్వ భూములను అనధికారంగా ఆక్రమించినా..మెరక చేసినా.. మట్టి తవ్వినా చట్ట రిత్యా నేరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ మైనింగ్ చర్యలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిపై గ్రామాల్లో తహశీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎస్‌బీ డీఎస్పీ ప్రభాకర్ బదిలీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌బీ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న డి.ప్రభాకర్ బదిలీ అయ్యారు. డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఆయనను పలమనేరు ఎస్‌డీపీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల కోటాలో ఆయన ఇక్కడికి ఇచ్చారు. ఈ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. కాగా ఈస్ట్ జోన్ డీఎస్పీ కిశోర్ కుమార్ ఏసీబీకి వెళ్లారు. అప్పటి నుంచీ ఆ పోస్టు ఖాళీగా ఉంది. నార్త్ జోన్ ఈ నెలాఖరులో ఖాళీ కానుంది.

డ్వామా పీడీగా శ్రీరాములు నాయుడు

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు21: తూర్పు గోదావరి జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ)గా జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీరాములు నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ పీడీగా విధులు నిర్వహిస్తున్న ముఖలింగంను రెగ్యులర్ పోస్టింగ్‌కు (జిల్లా ఎకనమిక్స్ స్టాటస్టికల్ అధికారి)గా రిపోర్టు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీడీకి కార్యాలయ ఏవో కిశోర్, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖలింగంను అకస్మాత్తుగా మార్చడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పోతున్నాయ్.. ప్రాణాలు!



అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదానికి గురైన ఫ్యాక్టరీ

ప్రాణాలు పోతున్నాయి.. పోయేవి కార్మికులవే కదా.. ఫ్యాక్టరీల యాజమాన్యాలివి ఎక్కడైనా ఉన్నాయా?? అందుకే నిర్లక్ష్యం.. బతుకు పోరాటంలో భద్రతలేక ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లాలో వందలాది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.. పరిశ్రమల్లో ఎక్కడైనా ప్రమాదం జరిగితే అధికారులు అప్రమత్తమైపోతారు.. పాలకులు పరుగులు పెడతారు.. ఒకట్రెండు రోజులు హడావుడి చేస్తారు.. ఆ తరువాత షరా మామూలే.. కంపెనీల దారి కంపెనీలదే.. అధికారుల దారి అధికారులదే.. కంపెనీలు ఇచ్చే ఆమ్యామ్యాలకు కార్మికుల భద్రతను తాకట్టు పెట్టేస్తున్నారు.. ప్రత్యేకంగా జిల్లాకో పరిశ్రమల శాఖ అంటూ ఉన్నా ఏనాడు తనిఖీలు చేసిన దాఖలాలే కానరావు.. ఈజ్ ఆఫ్ డూయింగ్ మాటున తనిఖీలకు సంకెళ్లు వేయడంతో యాజమాన్యాల ఇష్టారాజ్యంగా మారింది. దీంతో కార్మికులకు భద్రతే కరువైంది.. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలి.. జిల్లాకు చెందిన కార్మిక శాఖ మంత్రి సుభాష్ ఈజ్ ఆఫ్ డూయింగ్ సంకెళ్లను తెంచి భద్రతపై భరోసా ఇవ్వాలి..

పరిశ్రమల్లో కార్మికులకు అభద్రత

- అచ్యుతాపురం సెజ్ ఘటనతో ఉలికిపాటు
- 18 మంది కార్మికుల దుర్మరణం
- ఉమ్మడి జిల్లాలో చమురు, గ్యాస్ కంపెనీలు
- ఆయా పరిశ్రమల్లో భద్రతపై భయాందోళనలు
- తూతూ మంత్రంగా భద్రత ప్రమాణాలు
- కాకినాడ చుట్టూ పేలుడు ముప్పున్న కంపెనీలు
- ప్రమాదాలు జరిగితే ప్రాణాలు గాలిలోనే
- గత ప్రభుత్వంలో భద్రతా లోపాలపై నివేదికలు
- పలు కంపెనీల్లో నిబంధనల ఉల్లంఘనలు
- ఏ మాత్రం పట్టించుకోని గత పాలకులు
- కొత్త సర్కారు తనిఖీలు చేపట్టాలని డిమాండ్లు
- ఇకనైనా మేలుకోకుంటే ముప్పే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో బుధవారం చోటుచేసుకున్న ఘోర పారిశ్రామిక ప్రమాదంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటనలో ఏకంగా 18 మందికి పైనే కార్మికులు దుర్మరణం పాలవడం పారిశ్రామికవర్గాలను కలవరపాటుకు గురిచేస్తోంది. తాజా ఘటనతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల్లో డొల్లతనం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అరకొర భద్రత మధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికుల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పును ఈ దుర్ఘటన మళ్లీ ప్రశ్నిస్తోంది.

జిల్లాలో ఎన్నో పరిశ్రమలు..

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలు అనేక రకాల పరిశ్రమలకు పెట్టింది పేరు. ముఖ్యంగా కాకినాడ జిల్లా కేంద్రాన్ని ఆనుకుని నగరం చుట్టు పక్కల వందలాది చమురు,రసాయన కంపెనీలున్నాయి. ఇవన్నీ కాకినాడ పోర్టు ద్వారా విదేశాల నుంచి రకరకాల రసాయనాలను దిగుమతి చేసుకుంటాయి.ముఖ్యంగా చమురు పరిశ్రమలైతే విదేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుని బాయిలర్లలో ద్వారా శుద్ధిచేసి అనేక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తాయి. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పారిశ్రామికవాడల్లో పతంజలి, లోహియా ఎడిబుల్ ఆయిల్, కేపీఆర్ ఆగ్రో, శ్రీసాయి ఆయిల్ ఫీల్డ్, శ్రీకాకినాడ ఆక్సిజన్ గ్యాసెస్ ప్రైవేట్ లిమిటెడ్, పట్టాభి ఆగ్రో, ఆపెక్స్ ప్రోజెన్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐవోసీ, ఐవోసీఎల్, సంహిత స్టోరేజ్.భారత్ ఎంటర్‌ప్రైజెస్, అదాని ఆగ్రో ఆయిల్, ఎన్ఎఫ్‌సీఎల్, కోరమండల్ వంటి పరిశ్రమలు పనిచేస్తున్నాయి. సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లోను సిరామిక్, ఆగ్రో, ఆక్వా, టైల్స్ తయారీ వంటి పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులు నిరంతరం పనిచేస్తుంటారు. వీరిలో జిల్లాతోపాటు బిహార్, యూపీ, ఒడిషా తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు అధికంగా పనిచేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రసాయన, ఆగ్రో, కోనసీమలో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు, పైపలైన్లు అధికంగా ఉన్నాయి. ఈ పరిశ్రమలు, పైపులైన్లకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలకు దిక్కులేకుండా పోతోంది. తాజాగా బుధవారం పక్కనే ఉన్న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాద ఘటనతో ఉమ్మడి జిల్లాలో గతంలో జరిగిన పారిశ్రామిక ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. కోనసీమ జిల్లాలోని అనేక మండలాల్లో అప్పుడప్పుడు గ్యాస్ పైపలైన్లు లీకై ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నాయి. రామచంద్రపురం, మండపేట, అనపర్తి నియోజకవర్గాల్లోని ఆయిల్,ఆగ్రో పరిశ్రమల్లోను తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అనధికారికంగా తయారుచేసే మందుగుండు పరిశ్రమల్లో ఏటా ఇరవై మంది కిపైగా చనిపోతున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో పలు పరిశ్రమల్లో ఎక్కడో ఒక చోట ఏదొక ప్రమాదం జరుగుతూనే ఉంది.ముఖ్యంగా వాకలపూడిలో ఉన్న ఆయిల్ పరిశ్రమలో భద్రత ప్రమాణాలు పాటించడం లేదని ఏడాదిన్నర కిందట అధికారులు తేల్చారు. ఇందులో గనుక ప్రమాదం జరిగితే నగరంలో అర కిలోమీటరు మేర దాని ప్రభావం ఉంటుందని గుర్తించారు. అయినా గత వైసీపీ సర్కారు ప్రమాదాలు పొంచి ఉన్న పరిశ్రమల విషయంలో పెద్దగా చర్యలు తీసుకున్న పాపానపోలేదు. ఆయా కంపెనీల నుంచి మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇప్పించామని గొప్పలు చెప్పడం, ఆ ముసుగులో కంపెనీలను బెదిరించి తామూ కొంత దండుకోవడం మినహా కార్మికుల భద్రతకు గట్టిగా వ్యవహరించలేదు.

నాడు లోపాలు గుర్తించినా..

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదం తరహా ఘటనలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గడిచిన కొన్నేళ్లలో అనేకం చోటుచేసుకున్నాయి. ప్రధానంగా 2021లో కాకినాడలో సర్పవరం టైకీ రసాయన పరిశ్రమలో బాయిలర్ పేలిన ఘటనలో ఇద్దరు సజీవ దహనమయ్యారు. ఆ తర్వాత 2022లో ప్యారీ షుగర్స్ ఫ్యాక్టరీలో జరిగిన వరుస ప్రమాదాల్లో ఐదుగురి దేహాలు నుజ్జునుజ్జయ్యాయి. గతేడాది మార్చిలో పెద్దాపురం అంబటి ఆయిల్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఏకంగా ఏడుగురు కార్మి కులు దుర్మరణం చెందారు.అలాగే 2014 జూన్‌లో కోనసీమలోని నగరంలో గెయిల్ గ్యాస్‌పైపులైన్ పేలుడులో 15 మంది దుర్మరణం పాలయ్యారు. ఇలా అనేక ప్రమాదాల్లో ఎందరో చనిపోయారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలోని ఎల్జీపాలిమర్స్ గ్యాస్ లీకు దుర్ఘటన జరగడంతో 2020 మేలో ప్రభుత్వం అన్ని జిల్లాల్లో పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల డొల్లతనంపై తనిఖీలకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోను అప్పటి జేసీల నేతృత్వంలో ఫ్యాక్టరీలు, పరిశ్రమలు, ఫైర్, కాలుష్య నియంత్రణ బోర్డు తదితర శాఖలతో కూడిన అధికారుల బృందం జిల్లాలోని పరిశ్రమల్లో భద్రత లోపాలు, ప్రమాదాలు జరిగితే ప్రాణ నష్టం నివారించే వ్యవస్థలు ఉన్నాయో లేవో తనిఖీలు చేసింది. ఇరవై అంశాల్లో తనిఖీలు చేసి నివేదికలు తయారు చేశారు. ఇందులో పలు పరిశ్రమలు ప్రమాదాల నివారణకు కనీస చర్యలు తీసుకోవడం లేదని గుర్తించారు. కోనసీమలో అనేక గ్యాస్ పైపులైన్ల ద్వారా పొంచి ఉన్న ముప్పును గుర్తించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సర్కారుకు సిఫార్సులు చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం ఆ తర్వాత నివేదికలను గాలికొదిలేసింది. గతేడాది పెద్దాపురం అంబటి ఆయిల్ ఫ్యాక్టరీ దుర్ఘటన తర్వాత ఉమ్మడి జిల్లాలో అనుమతులు లేని, భద్రత చర్యలు పాటించని కంపెనీల పైనా తనిఖీలు చేపట్టారు. ఇందులో కొన్ని అత్యంత ప్రమా దకర కంపెనీలను గుర్తించారు. వీటిలో కార్మికుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని నిగ్గుతేల్చారు. కానీ ఆ కంపెనీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దాంతో పరిస్థితి మొదటికొచ్చింది.

కూటమి ప్రభుత్వం మేల్కొనాలి..

అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన దుర్ఘటనను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వం పరిశ్రమల్లో భద్రత వ్యవహారాలను మరింత పెంచేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. జిల్లాలో అత్యంత ప్రమాదకర పరిశ్రమల్లో పొంచి ఉన్న ప్రమాదాలు, తీసుకోవాల్సిన భద్రత చర్యలు, పేలుళ్ల నివారించడానికి ఆయా కంపెనీల సన్నద్ధత ఏ విధంగా ఉందో పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఫ్యాక్టరీలు, పరిశ్రమల్లో ప్రమాద నివారణ వ్యవస్థలు, మాక్‌డ్రిల్స్ జరుగుతున్నాయా? లేదా? రియాక్టర్లు, బాయిలర్స్ పేలుడు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మరింత అప్రమత్తత ఏ స్థాయిలో ఉందో సమీక్షించాల్సిన అవసరం ఏర్పడింది.

పాశర్లపూడిలంక వాసి మృతి



మామిడికుదురు, ఆగస్టు 21: అనకాపల్లిలో ఫార్మా కంపెనీలో బుధవారం మధ్యాహ్నం జరిగిన పేలుడు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలంక గ్రామానికి చెందిన మారిశెట్టి సతీష్ (31) మృతిచెందినట్టు సమాచారం. నాలుగేళ్లుగా సతీష్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడికి మూడేళ్ల క్రితం సాయిశ్రీ వినాయక దుర్గా వెంకట నాగమణితో వివాహమైంది. సతీష్ తండ్రి శ్రీను కొబ్బరి పీచుతో మ్యాట్‌లు తయారుచేసి విక్రయిస్తుంటాడు. తల్లి పద్మావతి గృహిణి. సమాచారం తెలియడంతో తల్లిదండ్రులు, భార్య ఇక మాకు దిక్కెవరంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



అనపర్తి శ్రీచక్ర ఆయిల్స్‌లో ప్రమాదం (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రమాదాలు

- అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన తరహా ప్రమాదం 2021లో కాకినాడ నగరం సర్పవరం టైకీ రసాయన పరిశ్రమలో జరిగింది. బాయిలర్ పేలిన ఘటనలో ఇద్దరు సజీవ దహనం కాగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- 2022 ఆగస్టు 19న కాకినాడను ఆనుకుని ఉన్న ప్యారీ షుగర్ ఫ్యాక్టరీలో విస్ఫోటనం చోటుచేసుకుంది. లోపల బాయిలర్ పేలడంతో ముగ్గురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు.తిరిగి ఆగస్టు 29న ఇదే ఫ్యాక్టరీలో రెండోసారి మూడో అంతస్తులో యంత్రం నుంచి ఓ పైప్ కింద పడిపోవడంతో ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు.
- గతేడాది అంటే 2023 ఫిబ్రవరి9న పెద్దాపురం అంబటి ఆయిల్ పరిశ్రమలోఇరవై అడుగులకుపైగా ఎత్తున పొడవాటి ఆయిల్ ట్యాంకులోకి శుభ్రం చేయడానికి దిగి మడ్డిలో ఇరుక్కుని దుర్మరణం పాలయ్యారు.
- 2014లో కోనసీమలోని నగరంలో గెయిల్ పైపులైన్ పేలుడు ఘటనలో 15మంది దుర్మరణం పాలయ్యారు.
- 2019లో తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పీరారామచంద్రపురంలో శ్రీచక్ర ఆయిల్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో రూ.25 కోట్లు నష్టం వాటిల్లింది. ప్రాణనష్టం సంభవించలేదు.
- 2022లో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారు కొండగూడెంలో ఉన్న విజన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు.

వర్గీకరణం!

జిల్లాలో బంద్ ప్రశాంతం

- ఎస్సీ వర్గీకరణ తీర్పు వ్యతిరేకిస్తూ నిరసన
- బస్టాండ్ ఎదుట హర్షకుమార్ ఆందోళన
- గామన్ బ్రిడ్జిపై జీవీ శ్రీరాజ్ ధర్నా
- అదుపులోకి తీసుకుని.. విడుదల
- కాసేపు స్తంభించిన ట్రాఫిక్
- షాపులు మూయించిన నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ చేపట్టిన బంద్ జిల్లాలో విజయవంతమైంది.బంద్‌కు విద్యా, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా సహకరించాయి. మాలసంఘాలు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి , బీఎస్పీ, కాంగ్రెస్, దళిత ఐక్యవేదిక, జనతా ప్రజాతంత్ర్య పార్టీ, మాలమహానాడు, ఎస్సీ సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ బంద్ సాగింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జిల్లాలోని రాజమహేంద్రవరం కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, సీతానగరం, గోపాలపురం, దేవరపల్లి, పెరవలి, ఉండ్రాజవరం తదితర మండలాల్లో బంద్ ప్రభావం కనిపించింది. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ ఎంపీ హర్షకుమార్ మంగళవారం అర్ధరాత్రి దాటాక రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుని అక్కడే ఉండిపోయి బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 6:45 గంటల వరకు ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు.దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రకాష్ నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హర్షకుమార్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అటుపై బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. హర్షకుమార్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించి అక్కడ నుంచి ఆయన నివాసానికి చేర్చారు. వర్గీకరణ తీర్పు ఉపసంహరించే వరకు పోరాటం ఆగదని హర్షకుమార్ స్పష్టం చేశారు. హర్షకుమార్ తనయుడు జీవీ శ్రీరాజ్ మరికొంత మంది యువకులు కాతేరు శివారు గామన్ బ్రిడ్జిపైకి చేరి ధర్నా చేశారు. దంతో విజయవాడ జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి అటుపై ఇంటికి చేర్చారు. మాల సంఘాల నాయకులు నిరసన ర్యాలీలు చేశారు. గోకవరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి నిరసన ర్యాలీగా బయలుదేరి పుష్కరాల రేవు, మెయిన్ రోడ్డు, శ్యామల సెంటర్ మీదుగా తిరిగి బైపాస్ రోడ్డు,కంబాలచెరువు మీదుగా లాలాచెరువు సెంటర్‌కు చేరుకున్నారు. మార్గమధ్యలో మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అక్కడక్కడా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలను, తెరిచి ఉన్న దుకాణాలను మూయించారు. లాలాచెరువు సెంటర్‌లో సుమారు అరగంట పాటు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. వర్గీకరణకు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.





ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద హర్షకుమార్,నాయకుల ధర్నా

జీవీ శ్రీరాజ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



రాజమహేంద్రవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి దళిత నాయకుల నినాదాలు



బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ

పటిష్ట బందోబస్తు : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): భారత్ బంద్ పిలుపు సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అందుబాటులో ఉన్న సిబ్బంది అందరినీ వివిధ ప్రాంతాల్లో మోహరించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. అసాంఘిక వ్యక్తుల కదలికలు, సమ స్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలను పంపించడం జరిగిందన్నారు.హైవేలపై దృష్టి సారించా మని చెప్పారు. జనజీవనానికి ఆటంకం లేకుండా చూశామన్నారు.

34 ప్రైవేట్ హాస్టల్స్ తనిఖీ

కనీస సౌకర్యాల్లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 21 : జిల్లా వ్యాప్తంగా అనేక ప్రైవేట్ వసతిగృహాలు, చైల్డ్ కేర్ సెంటర్లు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించడంలేదని అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వివిధ సంక్షేమశాఖల అధికారుల వసతిగృహాలు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను, పిల్లల సంరక్షణ కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మంగళవారం 19 చోట్ల, బుధవారం 15 చోట్ల వసతిగృహాలను తనిఖీ చేసి అక్కడి వసతులను, రికార్డులను పరిశీలించారు. కొన్ని ప్రైవేట్ వసతిగృహాలకు ప్రభుత్వ అనుమతులు లేకపోవడాన్ని గుర్తించారు. రాజమహేంద్రవరం అర్బన్ సచివాలయంలో ఒక ప్రైవేట్ వసతిగృహం నమోదు చేసుకున్నట్టు తనిఖీల్లో వెలుగు చూసింది. కొన్ని వసతిగృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, కొన్ని భవనాలు నివాసయోగ్యంగా లేకపోవడం వెల్లడైంది. జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి కేఎన్ జ్యోతి, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి శశాంక, ఇన్‌ఛార్జి ఐసీడీఎస్ అధికారిణి కె.నాగలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి ఎం.సందీప్, అనుబంధ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి తనిఖీలు జరిపారు. కలెక్టర్‌కు నివేదిక అందించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటన విడుదల చేశారు. అనధికార వసతిగృహాలకు ఇళ్లను ఇస్తే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, వసతిగృహాల విషయంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ప్రైవేట్ వసతిగృహాల నిర్వాహకులు తగిన అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడం, పిల్లల సంరక్షణ కేంద్రాల మార్గదర్శకాలు పాటించకుండా నిర్వహించడాన్ని తనిఖీ అధికారుల బృందం గుర్తించడం జరిగిందని తెలిపారు. నిర్వాహకులు తప్పనిసరిగా మార్గదర్శకాలు పాటించాలని, అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న వసతిగృహాలపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.



ప్రైవేట్ హాస్టళ్లలో విద్యార్థినులను ప్రశ్నిస్తున్న అధికారులు

ఉద్యోగోన్నతులు రద్దు

- 17 మందికి గ్రేడ్-1 వీఆర్వోలుగా రివర్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన కాకినాడ జిల్లా కలెక్టర్

చింతూరు, ఆగస్టు 21: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రెవెన్యూ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ సహాయకులకు గ్రేడ్-1 వీఆర్వోలుగా రివర్షన్ ఇస్తూ కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు రెండేళ్ల క్రితం జీవో నెం.154 ప్రకారం 17 మంది గ్రేడ్-1 వీఆర్వోలు సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి పొందారు. 17 మందిలో చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్లలో 14 మంది, మిగిలిన ముగ్గురు మండపేట, తుని, అయినవిల్లిల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనల మేరకు వారంతా నిర్దేశించిన కాల పరిమితిలో డిపార్ట్మెంటల్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. కాల పరిమితి పూర్తి అయినప్పటికీ వారంతా ఆ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదు. దీంతో వారందరినీ గ్రేడ్-1 వీఆర్వోలుగా (రివర్షన్) కాకినాడ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నకిలీ ఫోన్ పేతో బురిడీ

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో పద్మరాజు కిరాణా, ఫ్యాన్సీ హోల్‌సేల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఓ వ్యక్తి వచ్చి రెండు కింగ్ సిగరెట్ పెట్టెలు, ఒక ఫ్రీడం ఆయిల్ సీసా కావాలని కోరాడు. ఒక్కో సిగరెట్ బాక్స్ రూ.3,400 చొప్పున రెండింటికీ రూ.6,800, ఫ్రీడం ఆయిల్‌కి రూ.1,800 మొత్తం రూ.8,600 బిల్లు అయ్యింది చెల్లించాలని కోరాడు. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లిస్తానని చెప్పగా స్కానర్ ద్వారా నగదు చెల్లించాలని వ్యాపారి పద్మరాజు కోరాడు. స్కానర్ పని చేయట్లేదని, మొబైల్ నెంబరు చెప్పాలని కోరడంతో ఆ విధంగానే చేశాడు. ఫోన్ పే నెంబరుకు రూ.8,600 పంపినట్టు నకిలీ లావాదేవీ చూపించాడు. డబ్బులు ఇంకా అకౌంట్‌లోకి రాలేదని చెప్తున్న క్రమంలో బైక్‌పై సరుకుతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు. నకిలీ ఫోన్ పే లావాదేవీ చూపి తనను మోసం చేశాడన్న విషయాన్ని గుర్తించిన వ్యాపారి సీసీ పుటేజీ ద్వారా బైక్ నెంబరును గుర్తించి ఆర్టీవో కార్యాలయం ద్వారా వివరాలు సేకరించాడు. కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఉన్న క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. కొత్తపల్లి మండలం గంగోలిపేట అమీనాబాద్‌కు చెందిన వడ్డి రాజు పేరుపై ఏపీ 35జేఎం 5966 పేర బైక్ ఉన్నట్టు పద్మరాజు తెలిపాడు. దానికి పోలీసులు విధించిన జరిమానాలు కూడా పెండింగులో ఉన్నాయన్నాడు. నిందితుడిని పట్టుకుని నగదు రికవరీ చేయాలని కోరుతూ సర్పవరం క్రైం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

లింక్ ఓపెన్ చేయగానే
రూ.2.62 లక్షలు హాంఫట్

గండేపల్లి, ఆగస్టు 21: గుర్తు తెలియని నెంబరు నుంచి వచ్చిన లింక్ ఓపెన్ చేయగానే బ్యాంకు ఖాతా నుంచి రూ.2.62 లక్షలు మాయమైన ఘటనపై బుధవారం గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్ళూరుకు చెందిన పుచ్చకాయల వెంకటరమణకు గుర్తు తెలియని మొబైల్ నెంబరు నుంచి లింక్ వచ్చింది. ఆ లింక్‌పై అతడు క్లిక్ చేయగానే రూ.2.62 లక్షలు పోయినట్టు గ్రహించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు కేసు నమోదు చేయగా జగ్గంపేట సీఐ లక్ష్మణరావు దర్యాప్తు చేస్తున్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మరిడమ్మ హుండీల ఆదాయం
రూ.15.83 లక్షలు

పెద్దాపురం, ఆగస్టు 21: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని మరిడమ్మ అమ్మవారి ఆలయంలో హుండీలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బుధవారం తెరిచి లెక్కించారు. 29 రోజులకు రూ.15,83,217 సమకూరినట్టు దేవస్థానం సహాయ కమిషనరు చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మజీ, దేవదాయ శాఖ అధికారులు కాట్నం జగన్మోహన శ్రీనివాస్, చల్లా బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.



వెండి మబ్బులు

ఆకాశంలో వెండి మబ్బులు కనువిందు చేశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని టిడ్కో గృహాల సముదాయాల వద్ద బుధవారం ఉదయం పది గంటలకు కెమెరాకు చిక్కిందీ దృశ్యం. - మండపేట

ఇంటర్నేషనల్ స్టూడెంట్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన

జేఎన్టీయూకే, ఆగస్టు 21: జేఎన్టీయూ సెనేట్ హాల్లో ఫారన్ యూనివర్శిటీ రిలేషన్స్ (ఎఫ్‌యూఆర్) డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జేఎన్టీయూకే, యూఎస్‌ఏలోని సౌత్ యూనివర్శిటీ ఇంటర్నేషనల్ స్టూడెంట్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై బుధవారం ఎక్సెల్లా గ్రూప్ సహకారంతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉన్నత విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు అనేక అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. సౌత్ యూనివర్శిటీ ఇంటర్నేషనల్ మార్కెటింగ్ డైరెక్టర్ జోసెఫ్ క్యాస్ట్రో మాట్లాడుతూ 125 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన అమెరికాలోని సౌత్ యూనివర్శిటీకి రెండు క్యాంపస్‌లున్నాయని తెలిపారు. ఫ్లోరిడాలోని టంపా నగరంలో ఒకటి, జార్జియాలోని సవన్నా నగరంలో మరొకటి ఉండగా బిజినెస్ మేనేజ్‌మెంట్, సీఎస్ఈ, అలైడ్ హెల్త్‌సైన్సెస్‌లో విద్యార్థులకు పలు కోర్సులు అందిస్తున్నాయన్నారు. అనంతరం సౌత్ యూనివర్శిటీ అందించే కోర్సుల వివరాలు, ట్యూషన్ ఫీజు, ఉపాధి అవకాశాలు, క్యాంపస్‌లోని సదుపాయాలను వివరించారు. ఎఫ్‌యూఆర్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎ.స్వర్ణకుమారి అధ్యక్షత వహించగా ఎక్సెల్లా ఎడ్యుకేషన్ గ్రూప్ ప్రతినిధి డి.కాంతికిరణ్, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సౌత్ యూనివర్శిటీ డైరెక్టర్ జోసెఫ్ క్యాస్ట్రో

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఖరారు

రేపు కొత్తపేట మండలం వానపల్లి రాక



పళ్లాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఓ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు

కొత్తపేట, ఆగస్టు 21: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండల పరిధిలోని వానపల్లి గ్రామంలో శుక్రవారం జరిగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం ఆయన కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావులతో కలిసి వానపల్లిలోని పళ్లాలమ్మ అమ్మ వారి ఆలయ ప్రాంగణ సమీపంలోని ప్రదేశాలను పరిశీలించారు. దీనికి సంబంధించి రూట్‌మ్యాప్ ఖరారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారన్నారు. హెలిపాడ్‌కు సంబంధించి కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. పరిశీలనలో టీడీపీ సీనియర్ నాయకులు ఆకుల రామకృష్ణ, దర్నాల రామకృష్ణ, పల్లి భీమారావు, సలాది నాగేశ్వరరావు, పల్లి ఏసు తదితరులు వున్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పిఠాపురం రూరల్ పోలీసులు

పిఠాపురం రూరల్, ఆగస్టు 21: తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు పిఠాపురం రూరల్ పోలీసులు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం జల్లూరు గ్రామానికి చెందిన బత్తిన శ్రీరామ్ (13) ఈ నెల 18వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన కుమారుడు అదృశ్యమయ్యాడని బాలుడి తండ్రి శివన్నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శ్రీరామ్ జల్లూరు నుంచి సామర్లకోట సైకిల్‌పై వెళ్లి రైల్వే స్టేషన్లో పెట్టి అక్కడి నుంచి రైలు ఎక్కినట్టు గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి బుకింగ్ కౌంటర్‌లో విచారణ జరిపి బాలుడు విశాఖ వెళ్లినట్టు గుర్తించి వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాచారం ఇచ్చారు. బాలుడు విశాఖపట్టణంలో ఉన్నట్లు గుర్తించి బుధవారం పిఠాపురం రూరల్ పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. శ్రీరామ్ ప్రైవేటు స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. తనను చదవమని ఒత్తిడి చేస్తున్నారని, తమ్ముడిని బాగా చూస్తున్నారని, అందుకే ఇంటి నుంచి వెళ్లిపోయానని శ్రీరామ్ చెప్తున్నాడు. అతడిని బుధవారం రాత్రి ఎస్ఐ గుణశేఖర్ తల్లిదండ్రులకు అప్పగించారు.



నిందితుడిని మీడియాకు చూపిస్తున్న కోరుకొండ సీఐ నాగ మురళి

బంగారం షాపులో చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

42.5 గ్రాముల బంగారం, 450 గ్రాముల వెండి రికవరీ

కోరుకొండ, ఆగస్టు 21: తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ లోని ఒక బంగారం షాపులో మార్చిలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను కోరుకొండ మండలం కాపవరం శివారులో బుధవారం అరెస్టు చేశారు. దీనికి సంబం ధించి కోరుకొండ సీఐ అడపా నాగమురళి తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... మార్చి ఒకటో తేదీ అర్ధరాత్రి సమయంలో కోరుకొండ మసీదు పక్కన గల శ్రీలక్ష్మీ అయ్యప్ప బ్యాంకర్స్, బంగారం షాపులో జరిగిన దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో కాపవరం శివారులో ఉలిదిండి కిరణ్, బొమ్మోతి సుధీర్‌కుమార్‌లను అరెస్టు చేశారు. కిరణ్‌ది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరు సుధీర్‌ది కోరుకొండ మండలం పశ్చిమగోనగూడెం. వారిద్దరి నుంచి 42.5 గ్రాముల బంగారు వస్తువులు, 450 గ్రాముల వెండి వస్తువులు రికవరీ చేశారు. మరికొన్ని బంగారం వస్తువులను వరంగల్ సమీపంలోని హన్మకొండ, రాజుపేటల్లో ముత్తూట్ ఫైనాన్స్, కెనరా బ్యాంకుల్లో తాకట్టు పెట్టారు. వాటిని రికవరీ చేయాల్సి ఉంది. నిందితులిద్దరూ పాత నేరస్థులు. వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన కోరుకొండ సీఐ, ఎస్ఐ, సిబ్బందిని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ అభినందించారు. వారికి రివార్డు ఇస్తారని సీఐ నాగమురళి చెప్పారు..



సంఘటనా స్థలం నుంచి ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మోటారు సైకిలును ఢీకొన్న లారీ

- ఒకరికి తీవ్ర, ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు
- ఆ మార్గంలో వెళ్తుండగా చూసి స్పందించిన కలెక్టర్
- తక్షణం వైద్య సహాయం అందించాలని సూచన

రాజానగరం, ఆగస్టు 21: పరామర్శకు వెళ్తూ మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చూసి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చలించిపోయారు. వెంటనే వాహనం ఆపి 108 అంబులెన్సుకు ఫోను చేశారు. తక్షణ వైద్య సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులకు ఫోనులో సూచించారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో ఉన్న కలెక్టర్ ప్రశాంతి రాజానగరం హైస్కూలు సమీపంలో ప్రమాదంలో గాయపడి వైద్య సహాయం కోసం ఎదురుచూస్తున్న వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెద్దాపురం మండలం ఆనూరు-కొత్తూరు గ్రామానికి చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్, జి.వీరవెంకటలక్ష్మి, సీహెచ్ మసిరమ్మ మోటారు సైకిలుపై కోరుకొండ మండలం గాదరాడలోని తమ బంధువుల ఇంటికి పరామర్శకు బయల్దేరారు. ఏడీబీ రోడ్డులో రాజానగరం హైస్కూలు కూడలి వద్ద హైవే దాటుతున్న సమయంలో రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ మోటారు సైకిలును ఢీకొంది. హైవేపై ప్రయాణం చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నియమాలు పాటించాలని వాహనచోదకులకు కలెక్టర్ ప్రశాంతి సూచించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై జీఎస్ఎల్ వైద్యులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా... దుర్గాప్రసాద్ తలకు బలమైన గాయాలయ్యాయని, మిగిలిన ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు అయ్యాయని చెప్పారు.



ప్రమాదానికి కారణమైన లారీ

పాము కాటుకు వ్యక్తి మృతి

కరప, ఆగస్టు 21: కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లిలో అమ్మవారి గుడి వీధికి చెందిన మరుకుర్తి సత్తిబాబు (40) స్థానిక ఆక్వా చెరువుల వద్ద పని చేస్తున్నాడు. కాగా బుధవారం మధ్యాహ్నం చెరువుల వద్ద కాపలా కాస్తుండగా విష సర్పం కరిచింది. దీంతో అపస్మారక స్థితికి చేరుకుని అక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుని న్యాయం చేయాలని కోరుతూ బంధువులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది. ఎస్ఐ టి.రామకృష్ణ ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

కరప, ఆగస్టు 21: కాకినాడ జిల్లా కరప మండలం పెదకొత్తూరు గ్రామానికి చెందిన దాసరి భీమరాజు (28) బుల్డోజర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 19న పనిమీద ఉప్పాడ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వాకాడ వంతెన వద్దకు వచ్చేసరికి బండి స్కిడ్ అయ్యి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన భీమరాజును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు

మండపేటలో నేడు, రేపు
అంతర్జాతీయ సెమినార్

- దేశ, విదేశాల నుంచి శాస్త్రవేత్తల రాక

మండపేట, ఆగస్టు 21: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురు, శుక్రవారాల్లో అంతర్జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలి రోజు సెమినార్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. కళాశాల చరిత్రలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సెమినార్‌కు కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనరు పోలా భాస్కర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కృష్ణ, ఆర్జేడీ డాక్టర్ శోభారాణి, కొరియా దేశానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ కె.నవీన్ కుమార్, డాక్టర్ అక్కినేపల్లి భార్గవ్, డాక్టర్ బత్తుల బాబు, డాక్టర్ చావా రామకృష్ణ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ గురుప్రకాష్ నున్న, డాక్టర్ సీతారామరాజు, యునుగనమ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలతో పాటు డాక్టర్ వర్మకవి నరేష్, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, దేశంలోని ప్రసిద్ధ యూనివర్సిటీలకు చెందిన ఫిజిక్స్ విభాగ అధ్యాపకులు హాజరవుతున్నారని ఆయన చెప్పారు. తొలిసారిగా గ్రామీణ వాతావరణంలో విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేక్ గ్రేడ్ అటానమస్ కోసం కూడా ప్రయత్నిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సెమినార్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎ.ఆనందరావు, ఎన్ఎస్‌వీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు


సెమీ సంస్థలతో అదానీకి లబ్ధి

- సీడబ్ల్యుసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21: సెమీ సంస్థల ద్వారా అదానీ సంస్థలకు లబ్ధి చేకూర్చి పెడుతున్నారని సీడబ్ల్యుసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పదేళ్లు పూర్తి చేసుకుని 11వ ఏట అడుగుపెట్టిందన్నారు. ఈ కాలంలో ప్రధాని మోదీ అనేక దేశాల పర్యటనలకు సంబంధించిన ఖర్చులపై అధికారికంగా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోదీ విదేశీ పర్యటన వల్ల ఏ లాభం జరిగిందో తెలపాలన్నారు. దేశంలో వనరులను ధారాదత్తం చేశారని, మైన్స్‌ను అంబానీ, అదానీలకు కట్టబెట్టారని ఆరోపించారు. సోలార్‌కు సంబంధించి పెద్ద స్కామ్ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాలను అమలు చేయకుండా తాత్సారం చేస్తోందన్నారు. ప్రభుత్వ శాఖల ప్రక్షాళనతో పాటు అభివృద్ధి, సంక్షేమాలపై దృష్టిపెట్టాలన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర ఇన్‌చార్జి బోడా వెంకట్, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, సీనియర్ నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, అబ్దుల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి

1101 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



మోతుగూడెం, ఆగస్టు 21: డొంకరాయి జలాశయం ద్వారా బుధవారం ఉదయం 1101 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా బుధవారం ఉదయం 1036.50 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. పూర్తిస్థాయికి చేరుకుంటే గేట్లపై ఒత్తిడి పడే ప్రమాదం ఉందన్న నిపుణుల సూచనలతో జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈఈ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎగువున కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి 5,048 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. దీంతో 6వ నెంబరు గేటును ఒక అడుగు పైకెత్తి దిగువకు 1101 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నీటిమట్టం ప్రమాద స్థాయికి పెరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మరో 4వేల క్యూసెక్కుల నీటిని కెనాల్ ద్వారా పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తున్నామన్నారు. ఇన్‌ఫ్లోస్ తగ్గితే దిగువకు నీటి విడుదల నిలిపివేస్తామని ఈఈ చెప్పారు.

ఏజెన్సీ సమాచారం

కోల్‌కతా ఘటనలో నిందితులను ఉరి తీయాలి



రంపచోడవరంలో ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

రంపచోడవరం, ఆగస్టు 21: కోల్‌కతాలో డాక్టర్ మౌమితపై హత్యాచారానికి పాల్పడ్డ వారిని ఉరి తీయాలని సీఐటీయూ, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం వారు సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ప్రధాన కూడలిలో మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా మహిళలకు రక్షణ కరువైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు పుట్ట రామరాజు, కె.శాంతిరాజు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన నిర్మల, కొమరం చెల్లాయమ్మ, కొలెంకోట రమణమ్మ, సారపు మంగాయమ్మ పాల్గొన్నారు.

చింతూరు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ యువత ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, యువతీ, యువకులు, వైద్య సిబ్బంది, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఐటీడీఏ నుంచి చింతూరు ప్రధాన కూడలి వరకు భారీ ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్మించారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. యర్రం కాశి, మల్లిపూడి సతీష్, వెంకన్న, విరబోయిన రాజ్‌కుమార్, గణేష్, ప్రవీణ్‌కుమార్ (కప్పు), పోషేశ్వరపు (పోషి), నరెడ్ల అయ్యప్ప, సబీర్, సమీర్, హర్ష, పురాలశెట్టి దుర్గాప్రసాద్, కట్ట సాయి, కుకునూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



చింతూరు కూడలిలో మానవహారం

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు, ఆగస్టు 21: బాల్య వివాహాలపై పాఠశాలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కల్పించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో డివిజనల్ స్థాయి బాల్య వివాహాల నిర్మూలన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో



మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, నష్టాలను బాలబాలికలకు వివరించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామస్థాయి కమిటీలు అవగాహన సదస్సులు నిర్వహించాలని, కమిటీ సభ్యులందరూ పాల్గొనాలన్నారు. చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల ఆర్థికంగా, కుటుంబపరంగా, ఆరోగ్యపరంగా ఏ విధంగా నష్టపోతున్నారో తెలియజేయాలన్నారు. మండల మహిళా సమావేశాల్లో సైతం బాల్య వివాహాలపై చర్చించాలన్నారు. అమ్మాయి, అబ్బాయి వయసు తెలుసుకుని పెళ్లి జరిపించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉప వైద్య-ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుల్లయ్య, ఐసీడీఎస్ చింతూరు సీడీపీవో విజయగౌరి, చింతూరు ఏఎస్‌ఐ మల్లికార్జునరావు, ఏపీఎంలు భాస్కర్, నాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నమాణిక్యం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలి

రంపచోడవరం సబ్ కలెక్టరుకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ వినతి



రంపచోడవరం, ఆగస్టు 21: రంపచోడవరం మన్యంలోని అన్ని మండల కేంద్రాల్లో అక్రమ కట్టడాలను తక్షణం తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంతకుమార్‌ని కోరింది. ఆదివాసీ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు మోడిద నూకరాజు, నాయకులు బుధవారం సబ్ కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ చట్టాలను, రెవెన్యూ చట్టాలను ఉల్లంఘించి అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారని, రంపచోడవరంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా గిరిజనేతరులు ఆక్రమణలకు పాల్పడ్డారని, అడ్డతీగలలో కూడా ఇష్టారాజ్యంగా కట్టడాలు సాగించారని, రెవెన్యూ అధికారులు కూడా వీటికి ప్రోత్సాహం ఇస్తున్నారని పేర్కొన్నారు. తగు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు సబ్ కలెక్టర్ వివరించారు.

భారత్ బంద్ ప్రశాంతం



ఎటపాక, ఆగస్టు 21: ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం మాలల సంఘాల జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన భారత్ బంద్ ప్రశాంతంగా జరిగింది. పాఠశాలలు, బ్యాంకులు, పోస్టాఫీసులను మూయించి వేశారు. మండలంలోని పలు పాఠశాలలు మూతపడ్డాయి. తీర్పుపై సుప్రీంకోర్టు పునః సమీక్షించాలని కోరారు. దారా రవి, కృష్ణమోహన్‌రావు, ప్రశాంత్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

బాపనమ్మ తల్లికి ఎమ్మెల్యే శిరీషదేవి పూజలు



రంపచోడవరం, ఆగస్టు 21: సీతపల్లి గడి బాపనమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

దేవీపట్నం ఎంపీడీవోగా రత్నకుమారి



దేవీపట్నం, ఆగస్టు 21: దేవీపట్నం ఎంపీడీవోగా రత్నకుమారి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా వేరే ప్రాంతానికి వెళ్లిన ఆమె తిరిగి వచ్చారు. రత్నకుమారికి సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని చింతూరులోనే కొనసాగించాలి

చింతూరు, ఆగస్టు 21: చింతూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని చింతూరులోనే కొనసాగించాలని ఆదివాసీ జేఏసీ చింతూరు డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ డిమాండ్ చేశారు. చింతూరులో ఉన్న రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఎటపాకకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నట్టు తమకు సమాచారం వచ్చిందని. ఈ నిర్ణయం దుర్మార్గమన్నారు. కూనవరం, వర రామచంద్రపురం, ఎటపాక మండలాలకు చింతూరు సరిసమాన దూరంలో ఉన్న విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. గోదావరి వరదల సమయంలో చింతూరు కేంద్రంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యాచరణ రూపకల్పన చేసి చర్యలు చేపడుతున్నారన్నారు. జేఏసీ నాయకుడు శీలం తమ్మయ్య పాల్గొన్నారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేయించాలి

రంపచోడవరం, ఆగస్టు 21: ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేయించాలని విద్యా కమిటీ చైర్మన్ చుప్పల రాజశేఖరరెడ్డి బుధవారం ఐటీడీఏ పీవో సింహాచలాన్ని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపక శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 21 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బ్యాంకింగ్ ఫైనాన్స్ అండ్ ఇన్స్యూరెన్స్ కోర్సుపై మూడు రోజుల అధ్యాపక శిక్షణ బుధవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారు. విద్యార్థుల్లో వ్యవస్థాపక నైపుణ్యాలు ఉద్యోగ అవకాశాలు పెంపొందించడానికి అధ్యాపకులకు ఈ శిక్షణ ఎంతో ఉపకరిస్తుందని, వివిధ కళాశాలల నుంచి అధ్యాపకులు హాజరవుతున్నారని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఏపీఎస్‌సీహెచ్‌ఈ, సీఆర్‌ఐఎస్‌పీ, కళాశాల ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తున్నారు.

బంద్ విజయవంతం



గోకవరంలో బంద్‌లో పాల్గొన్న మాల నాయకులు

గోకవరం, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ గోకవరంలో బుధవారం చేపట్టిన భారత్ బంద్ విజయవంతమైంది. మాల మహానాడు ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన ఈబంద్‌లో రాజకీయాలకు అతీతంగా మాల నాయకులు, ఉద్యోగులు, కర్షక, కార్మిక, స్వచ్ఛంద ప్రతినిధులు పాల్గొని శాంతి యుత వాతావరణంలో బంద్‌ను జయప్రదం చేశారు. బంద్ కారణంగా ఆర్టీసీ బస్ రాకపోకలను అధికారులు కొన్ని గంటలపాటు నిలిపివేసారు. ఆర్టీసీ డిపో సమీపంలో వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి నాయకులు బైఠాయించి నిరసనతెలిపారు.

బిక్కవోలు: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా ఇచ్చిన తీర్పుకు నిరసనగా బలభద్రపురం గ్రామంలో మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా జరిగింది. విద్యా సంస్థలు, వ్యాపార దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. మాల మహానాడు జేఏసీ నేతలు గ్రామంలోని కెనాల్‌రోడ్డుపై ఆందోళన చేసి ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రంగంపేట: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బుధవారం తలపెట్టిన భారత్‌బంద్ కారణంగా రంగంపేట మండలంలో గల అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు మూసివేసారు.

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలంలోను హుక్కుంపేట, జైహిందనగర్, మోరంపూడి, సాయినగర్, బాపూజీ నగర్, వెంకటగిరి , వివిఎల్‌పురం వరకు, పిడింగొయ్యి కాతేరు. గ్రామాల్లో ఎస్సీవర్గీకరణ వ్యతిరేకంగా భారత్ బంద్ లోభాంగా దుకాణాలు, విద్యాసంస్థలు మూసివేసారు. ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రూరల్‌మండల నాయకులు సుందరపల్లి అనిల్, నక్కా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బంద్ చేశారు. కార్యక్రమంలో కొల్లి రవితేజ, నీతిపూడి సురేష్, మల్లవరపు అన్వేష్, అంబేడ్కర్ యువజన సంఘాలు, మాల సంఘాలు ,యువత అత్యధికంగా పాల్గొన్నారు.

కోరుకొండ : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో భారత బంద్ సందర్భంగా కోరుకొండలో నిరసన ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు గుమ్ములూరి సర్పంచ్ నక్కా రాంబాబు, మాజీ ఎంపీటీసీ పిట్టా కృష్ణ, పలువురు మాల మహానాడు నాయకులు, ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. కోరుకొండ, కాపవరం, పశ్చిమగోనగూడెం, జంబుపట్నం గ్రామాలకు చెందిన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, కార్యకర్తలు ఈ నిరసనలో పాల్గొన్నారు.

పంటల భీమా పథకాలు రైతులకు కీలకమైనవి: జేసీ

రాజమహేంద్రవరంరూరల్ ఆగస్టు21: వాతావరణంలో మార్పులు ప్రకృతి వైపరీత్యాలు, వ్యవసాయ మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గుల కారణంగా రాబడి నష్టం వంటి వాటివల్ల రైతు నష్టపోకుండా ప్రభుత్వం పంటల భీమా విధానాన్ని ప్రవేశపెట్టిందని జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో పంటల భీమా పథకం, పంటకోత ప్రయోగాలు, ఈ-పంట నమోదుపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా రైతు పండించిన పంటకు ప్రకృతి విపత్తుల వలన ఏర్పడిన నష్టానికి పరిహారం చెల్లించేందుకు ప్రతి రైతు తాను పండించే పంట ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోనేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంట కోత ప్రయోగాలు పక్కాగా నిర్వహించి ఖచ్చితమైన దిగుబడులు నమోదు చేయాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 96 శాతం సిసిఆర్సీ కార్డులు నమోదు, 48వేల ఎకరాల్లో ఈ-పంట నమోదు జరిగిందన్నారు. వ్యవసాయ రంగంలో 85,684 ఎకరాలు, హార్టీ కల్చర్ రంగంలో 50,372 ఎకరాలు సాగు విస్తీర్ణం ఉందన్నారు. ఈ క్రాప్ బుకింగ్ 1,36,056 ఎకరాలకుగాను 48వేల ఎకరాలలో నమోదు కాగా బిక్కవోలు 59 శాతం, గోకవరం 54 శాతం సాధించగా సీతానగరం 15 శాతం, రాజమహేంద్రవరం రూరల్ 16 శాతం సాధించి దిగువ స్థానంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి అప్పలకొండ, కోరుకొండ గణాంక అధికారి, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, హార్టీకల్చర్ అధికారి సుజాతకుమారి పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు పూర్వ వైభవం తెస్తాం: ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 21 : గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తే నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలకు పూర్వవైభవం తెస్తామని, 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు జమ చేసిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తి మం డలం పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన మండల పరిష త్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖల ప్రగతిని సభకు వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిల్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్వహి ంచిన రీసర్వేలో అనేక పొరబాట్లు జరిగిన విషయం వాస్తవమేనని దీంతో రైతులు రిజిస్ట్రేషన్లు జరగక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి విద్యాశాఖ ప్రగతిని వివరిస్తూ పాఠశాలల అదనపు గదుల నిర్మాణాలు అనేక చోట్ల నిధులు చాలక నిలిచిపోయినట్లు వివరించారు. అదే విధంగా ఐసిడిఎస్ సిడిపీవో జెర్సీఫ్లోరెన్స్ మాట్లాడు తూ తమ శాఖ ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందుతున్న



సమావేశంలో ఐసిడిఎస్ ప్రగతిపై సీడీపీవోను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

పౌష్టికాహార వివరాలను వెల్లడించారు. విద్యుత్, గృహనిర్మాణ పంచాయతీరాజ్ , ఇరిగేషన్, వ్యవసాయ, హార్టీకల్చర్, రోడ్లు భవనాల, ఇరిగేషన్ శాఖల అధికారులు వాటి ప్రగతిని వివరిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వాటిని సరిచేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమాలపై దృష్టి సారించిందని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో హిమ మహే శ్వరి, పంచాయతీ రాజ్ డీఈ వెంకటరామారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులగం బులిరెడ్డి, కర్రి దాసు, సర్పంచ్‌లు, ఎమ్‌పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టును తీర్పును వ్యతిరేకించడం బాధాకరం

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు21: ఎస్సీవర్గీకరణ వ్యతిరేకించడం చాలా బాధాకరం అని మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుమర్తి చిన్నమాదిగ విమర్శించారు. బొమ్మూరులో ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీవర్గీకరణ చేయాలని జస్టిస్ చంద్రచూడ్ అధ్యక్షతన ఏడు గురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును బహిరంగంగా వ్యతిరేకించడం బాధాకరమన్నారు. కృతజ్ఞతగా మోదీ, చంద్రబాబు ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసేందుకు వెళ్తుంటే తనను హౌస్ అరెస్టు చేశారని అన్నారు. స్వాతంత్ర్యవచ్చిన నాటి నుంచి రిజర్వేషన్ ఫలాలు మాదిగలకు అందలేదని తెలిపారు. ఈ సమావేశంలో సమితి వ్యవస్థాపక సభ్యులు పసలపూడి శ్రీనివాస్, రాచర్ల మురళీ, కొమ్ము వెంకటరావు, సిందే హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వాష్ సంస్థ సేవలు అభినందనీయం

దివాన్‌చెరువు, ఆగస్టు 21 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉపయోగార్థం మౌళికసదుపాయాల కల్పనకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ వాష్ ఇన్‌స్టిట్యూట్ సేవలు అభినందనీయమని జనసేనపార్టీ రాజానగరం నియోజకవర్గ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డుకాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వాష్ సంస్థ సహకారంతో రూ.12 లక్షలతో నిర్మించనున్న డైనింగ్‌హాల్ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు.

అంతర్జాతీయ సువార్త గాయకుడు జుత్తుక ఆశీర్వాదం మృతి



రంగంపేట, ఆగస్టు 21 : అంతర్జాతీయ సువార్త గాయకుడు జుత్తుక ఆశీర్వాదం మరణవార్త వినగానే మండలంలో ప్రజలంతా దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈయన గత నెల రోజుల నుంచి కామెర్ల వ్యాధితో బాధపడుతూ కాకినాడ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుది శ్వాస విడిచారు. ఈయన రంగంపేట మండలం కోటపాడు గ్రామంలో సువార్త సేవచేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. ఈయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన భౌతిక ఖాయానికి వేలాది మంది క్రైస్తవ సంఘాల సభ్యులు, పాస్టర్లు బుధవారం కోటపాడు గ్రామంలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ప్రముఖులు కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి పరామర్శించారు.

జేఎన్టీయుకే ఆవిర్భావ వేడుకల్లో జీజీయూకు పురస్కారాలు

రాజానగరం, ఆగస్టు 21: గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు) ప్రాంగణంలోని గైట్ కళాశాల జేఎన్టీయుకే 17వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అత్యధిక అవార్డులను అందుకున్నట్లు విశ్వవిద్యాలయం కులపతి, చైతన్య సంస్థల చైర్మన్ కెవి సత్యనారాయణరాజు (చైతన్యరాజు), జిజియు ఉపకులపతి యు.చంద్రశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం జరిగిన అభినందన సభలో చైతన్యరాజు మాట్లాడుతూ గైట్ అటానమస్ కళాశాల నాక్ ఏ ప్లస్ ప్లస్ అక్రిడేషన్‌తోపాటు వరుసగా ఆరవసారి ప్రతిష్టాత్మకమైన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధించినందుకు గైట్ కళాశాల గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంగా ఆవిర్భవించిన సందర్భంగా అప్‌గ్రేడేషన్ అవార్డును జిజియు రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావులకు రాష్ట్ర ఉన్నత మండలి ఇన్‌చార్జ్ చైర్మన్ రా మ్మోహన్‌రావు జెఎన్టీయుకే ఇన్‌చార్జ్ ఉపకులపతి మురళీకృష్ణ అంద జేశారన్నారు. జేఎన్టీయుకే అనుబంధ కళాశాలల పరిధిలో గైట్ అటానమస్ కళాశాల ఆచార్యులు ఎం.శ్రీనివాసరావు మెకానికల్ విభాగంలోనూ, బి.సుజాత సీఎస్ఈ విభాగంలోనూ ఉత్తమ అధ్యాపక పురస్కారాలను అందుకున్నారన్నారు. అవార్డు గ్రహీతలను చైతన్యరాజు, వైస్‌చాన్సలర్ చంద్రశేఖర్ అభినందించారు. జిజియు డీన్ ఎన్.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు భావితరాలకు వారసత్వ సంపద

దివాన్‌చెరువు, ఆగస్టు21 : వృద్ధులు భావితరాలకు వారసత్వసంపద అని, ప్రతీఒక్కరూ వృద్ధులను తప్పక గౌరవించాలని జనసేన పార్టీ రాజానగరం నియోజకవర్గ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. మదర్ థెరిసా సేవాసమితి 13వ వార్షికోత్సవం కార్యక్రమాలలో భాగంగా రాజానగరం మండలం లాలాచెరువు హౌసింగ్‌బోర్డుకాలనీలో ప్రపంచ వృద్ధుల దినోత్సవంను సేవాసమితి వ్యవస్థాపకుడు ఉందుర్తి సుబ్బారావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కొంతమంది వృద్ధులను ఆమె సత్కరించి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కాదా ఈశ్వరరావు, రాయుడుశ్రీను, బి.వెంకటేశ్వరరావు, సతీష్, మదర్‌థెరిసా సేవాసమితి గౌరవ అధ్యక్షులు యార్లగడ్డ జాన్‌సుందరరాజు, తదితర్లు పాల్గొన్నారు.

నేడు హార్లిక్స్ ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ ఎన్నిక

ధవళేశ్వరం, ఆగస్టు21: ధవళేశ్వరంలోని జాతీయ రహదారిపై ఉన్న హార్లిక్స్ ఫ్యాక్టరీ గుర్తింపుట్రేడ్ యూనియన్ ఎంపికకు లేబర్‌కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఫ్యాక్టరీ ఆవరణలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ, గోదావరి జీఎస్‌కే, జీఎస్‌కే హార్లిక్స్ వర్కర్స్ యూనియన్లు సమైఖ్యంగా పోటీచేస్తూ సీఐటీయూ అనుబంధ ఎస్‌బీ సీబీ ఆపరేటర్స్ అండ్ వర్కర్స్ యూనియన్‌తో తలపడనున్నాయి. కొద్దిరోజులుగా పోటీ చేస్తున్న యూనియన్ నాయకులు ఫ్యాక్టరీ వద్ద గేటు మీటింగ్‌లు నిర్వహిస్తూ ప్రచారం చేస్తున్నారు. మొత్తం 974 మందికి ఓటు హక్కు ఉండగా గురువారం ఎన్నికలు నిర్వహించడానికి ఫ్యాక్టరీలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

● భారీగా పోలీస్ బందోబస్తు

హార్లిక్స్ ఫ్యాక్టరీ ట్రేడ్ యూనియన్ ఎన్నికల రాజకీయ పార్టీల ప్రమేయంతో ప్రతిష్టాత్మకంగా మారాయి.ఈ నేపథ్యంలో ఎటువంటి ఘర్షణలు జరగకుండా దక్షిణ మండలి డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ అమల్లో ఉన్నట్లు ప్రకటించారు. ముగ్గురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 30 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

అభివృద్ధికి ప్రణాళికలు: ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, ఆగస్టు 21: అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని త్వరలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని, ఇప్పటికే కొన్ని అభివృద్ధి పనులు చేపట్టామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. బుధవారం మాధవరాయుడుపాలెం సర్పంచ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అన్నందేవుల చంటి సోదరుడు పెదబాబు కుమారుడు ఫణీంద్రవీరాస్వామినాయుడు వివాహ కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి అయితేనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, గట్టి నర్సయ్య, మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి నాని, అన్నందేవుల పెదబాబు, వాసిరెడ్డి రాంబాబు, గొల్లపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లిని కోరిన వర్తకులు

అనపర్తి, ఆగస్టు 21 : అనపర్తి మెయిన్ రోడ్డులో పార్కింగ్ స్థలంలో చిరు దుకాణాలవల్ల ఇటు వ్యాపారులు, అటు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై బుధవారం ఆంధ్రజ్యోతిలో అనపర్తిలో రోడ్డునూ వదల్లేదు పేరుతో వచ్చిన వార్తకు స్పందన లభించింది. బుధవారం వర్తక సంఘ కళ్యాణ మం డపంలో వర్తక సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వెంకట రామారెడ్డితో సమావేశమైన వర్తకులు మెయిన్ రోడ్డులో డివైడర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరేందుకు తీర్మానం చేసుకున్నారు. మండల పరిషత్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డిని కలిసిన వర్తకులు తమ ఇబ్బందులను చెప్పుకున్నారు. దీంతో అప్పటికప్పుడే అధికారులు, పోలీసులతో కలిసి ఎమ్మెల్యే వర్తకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డివైడర్ ఏర్పాటు చేయడం విషయం కాదని దానివల్ల ఎదురయ్యే సమస్యలపై కూడా చర్చ జరగాలని ముందుగా తోపుడు బండ్ల వర్తకులతో కూడా సమావేశం నిర్వహించి వారి మాటలను కూడా వినాలని ఇరుపక్షాలకు ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. దీని కోసం వర్తక సంఘ అధ్యక్షుడు వెంకటరామారెడ్డి, ఎస్ఐ శ్రీను నాయక్‌లతో కలిసి తోపుడు బండ్ల వర్తకులతో కూడా చర్చించాలని వారి అభిప్రాయాన్ని కూడా పరిగణలోకి తీసుకుని తదుపరి చర్యలపై అలోచన చేయవచ్చని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో హిమమహేశ్వరి, తహ సీల్దార్ అనిల్‌కుమార్, రోడ్లు భవనాల శాఖ ఏఈ రాంబాబు, వర్తక సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి, వర్తకులు పాల్గొన్నారు.

పందలపాక ఉన్నత పాఠశాలలో అంతర్గత క్రీడాపోటీలు

బిక్కవోలు, ఆగస్టు 21: పందలపాక ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్గత క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీలను పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోణాల సత్తిరాజు ప్రారంభించారు. పాఠశాలలో ప్రభుత్వం యేడాదికి రెండుసార్లు ఈక్రీడా పోటీలు నిర్వహించాలని ఆదేశించడంతో చెస్, కబడ్డీ, స్కిప్పింగ్, రన్నింగ్, త్రోయింగ్, జంపింగ్ వంటి క్రీడలను జూనియర్, సీనియర్ విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించామని పీడీ యువరాజారెడ్డి తెలిపారు. విజేతలకు జాతీయ క్రీడాదినోత్సవం అయిన ఆగస్టు 29న లయన్స్ క్లబ్ గొల్లల మామిడాడ శ్రీసూర్య వారు అందజేస్తారని హెచ్‌ఎం చిల్ల శ్రీనివాసరెడ్డి వివరించారు.

మృతుని కుటుంబానికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా

అనపర్తి, ఆగస్టు 21: బిక్కవోలులోని కేపీఆర్ పెర్టిలైజర్స్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చొరవతో న్యాయం జరిగింది. ఫ్యాక్టరీ యాజమాన్యం దిగివచ్చి మృతుని కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించింది. వివరాల ప్రకారం బిక్కవోలులోని కేపీఆర్ పెర్టిలైజర్స్ కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో కాకినాడకు చెందిన దుర్గాప్రసాద్ అనే కార్మికుడు మృతి చెందాడు. బాధిత కుటుంబం ఆందోళన చేయడంతో ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.10లక్షల పరిహారంతో బాటు ఇన్సూరెన్స్‌కు సంబంధించిన సొమ్ములు కూడా చెల్లిస్తామని లేబర్ కమిషనర్ సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. పరిహారం అడిగేందుకు వెళ్ళిన మృతుని కుటుంబాన్ని యాజమాన్యం నానా దుర్భాషలాడుతూ బయటకు పంపేయడంతో వీరు ఎమ్మెల్యే నల్లమిల్లిని ఆశ్రయించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి లేబర్ అధికారులతో సంప్రదించడంతో రూ.15లక్షలు లేబర్ డిపార్ట్‌మెంట్‌కు అందజేశారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి బుధవారంరాత్రి బాధిత కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబం నల్లమిల్లికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి ఎమ్మెల్యే రూ. 50 వేలు విరాళం



ఆలయాభివృద్ధికి రూ. 50 వేల విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 21: దైవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఒకటో డివిజన్ సైక్లోన్ కాలనీలో గల కనకదుర్గమ్మ ఆలయం అభివృద్ధికి బుధవారం ఎమ్మెల్యే తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ,మామిడి శ్రీనివాస్,భద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు మందులు అందజేత

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 21: ప్రియదర్శిని చెవిటి,మూగ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు బుధవారం అందజేశారు. పీఎంపీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో మందులు సమకూర్చినట్టు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు,జిల్లా కార్యదిర్శి పి.దేవా నందం,అధ్యక్షుడు రహమాన్ ఖాన్,కార్యదర్శి మట్టా రమేష్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజమ హేంద్రవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంస్కృతం, పౌరశాస్త్రం బోధించడానికి అతిథి అధ్యాపకుల(గెస్ట్ లెక్చరర్) నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎల్‌వీ.నరసింహం తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎంపికైన వారికి గంటకు రూ.150 చొప్పున నెలకు గరిష్ఠంగా రూ.10వేలు మించ కుండా గౌరవ వేతనం లభిస్తుందన్నారు. బయోడేటా, ధ్రువపత్రాల జిరాక్సు కాపీ లను ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4గంటలలోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. 24న ఉదయం 10గంటల నుంచినిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

రంగంపేట: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న వృక్షశాస్త్రం(బోటనీ), జంతుశాస్త్రం(జువాలజీ), వాణిజ్యశాస్త్రం(కామర్స్) సబ్జెక్టులలో గెస్ట్‌లెక్చరర్‌గా పనిచేసేందుకు ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సంబంధిత సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యూయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 23వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకుని 24వ తేది ఉదయం 11 గంటలకు కళాశాలలో అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు




రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 21 : రాజ మహేంద్రవరం ఇస్కాన్ మంది రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం లక్ష్మీ నరసింహ యజ్ఞం, సూర్యప్రభ వాహనసేవ, కృష్ణ లీలా కథా మృత ప్రవచనం, బాలల చేత కూచిపూడి నృత్యం కన్ను ల పండువుగా జరిగాయి.భక్తులను విశేషంగా అలరింప జేశాయి. చివరిగా, రాధాకృష్ణులను, చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. మందిర కమిటీ చైర్మన్ శివానంద నిమాయిదాస్, సభ్యులు శ్యామంగ శ్రీనివాస్, రవీంద్ర చక్రదాస్, హేమ నిమాయీదాస్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఐఎన్‌టీయూసీ బలోపేతం దిశగా కాంగ్రెస్ అడుగులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 : ఐఎన్‌టీయూసీ బలోపేతం దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తుందని ఆ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. స్థానిక క్వారీసెంటర్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఎన్‌టీయూసీకి చాలా గొప్పచరిత్ర ఉందన్నారు. కార్మికులకు అండగా ఉంటానన్నారు. ఐఎన్‌టీయూసీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామకృష్ణ, కార్యదర్శిగా రాజులను రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్ ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, బర్రే సుబ్రహ్మణ్యం, శిఖ బాలాజీ శర్మ, ఐఎన్‌టీయూసీ నాయకులు డేనియేలు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తి

రాజమహేంద్రవరం సిటీ, ఆగ స్టు 21: రాజమహేంద్రవరం అర్బన్ మండల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల పని సర్దుబాటు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ కార్యాలయంలో బుధవారం జరిగిన కౌన్సెలింగ్‌కి జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం ,సాంఘిక శాస్త్రం ,మునిసిపల్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు. సీనియార్టీ ప్రకారం వివిధ పాఠశాలలను ఎంచుకున్నారు. డీఐ దిలీప్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మూడు సబ్జెక్టుల్లో కౌన్సెలింగ్ పూర్తి చేశామని.. మిగిలిన సబ్జెక్టులు ,సెకండరీ గ్రేడ్ టీచర్ల కౌన్సెలింగ్ త్వరలోనే నిర్వహించేందుకు చర్యలు చేపడతామన్నారు. యూటీఎఫ్ కార్యదర్శి రవిబాబు, లివింగ్‌స్టన్, డి.మూర్తి డీఈవో వాసు దేవరావుకు ధన్యవాదాలు తెలిపారు.



అచ్యుతాపురం సెజ్ ఘటనలో కాకినాడ యువతి మృతి



సర్పవరం జంక్షన్, ఆగస్టు 21: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో కాకినాడ యువతి మృతిచెందింది. కాకినాడ 2వ డివిజన్ సౌజన్యనగర్‌కు చెందిన చల్లపల్లి హారిక (22) ఫ్యాక్టరీలో కెమిస్ట్‌గా పనిచేస్తోంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం కాకినాడ వచ్చి పెదనాన్న కుమారులకు రాఖీ కట్టి ఆనందంగా గడిపింది. బుధవారం తెల్లవారుజామున కాకినాడ నుంచి బయలుదేరి అచ్యుతాపురం వెళ్లింది. విధి నిర్వహణలో ఉండగా రియాక్టర్ పేలిన దుర్ఘటనలో హారిక మృతిచెందిందన్న వార్త విన్న తల్లి అన్నపూర్ణ, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఐదు పాఠశాలలకు ఎక్స్‌లెన్స్ అవార్డు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 21 : క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఐదు స్కూళ్లను స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డులకు ఎంపిక చేశారు. దేవరపల్లి మండలం పల్లంట్ల ఎస్‌ఈఎస్‌పీఆర్‌ఆర్ జడ్‌పీ హైస్కూల్ (157 పాయింట్లు), రామన్నపాలెం జడ్‌పీ హైస్కూల్ (133 పాయింట్లు), చిన్నాయిగూడెం జడ్పీ హైస్కూల్ (113 పాయింట్లు), దేవరపల్లి ఏఎస్ఎన్ఆర్ జడ్‌పీ హైస్కూల్ (105 పాయింట్లు), బ్రాహ్మణగూడెం జడ్‌పీ హైస్కూల్ (75 పాయింట్లు)తో ఎక్స్‌లెన్స్ అవార్డులకు ఎంపికయ్యాయి. 2023-24లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన గేమ్స్ అండ్ స్పోర్ట్సులో క్రీడాకారులు కనబరచిన ప్రతిభ ఆధారంగా అవార్డులకు ఎంపిక చేసినట్టు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. పరిశీలకులుగా పీడీ ఏవీడీ ప్రసాద్, వి.సింహాద్రిరావు, సీహెచ్ సతీష్‌కుమార్ వ్యవహరించారు. ఆయా పాఠశాలలకు ఆగస్టు 29న రాష్ట్ర విద్యాశాఖ ద్వారా ఒక ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తారు.

25 నుంచి సామూహిక ఎలుకల నిర్మూలన

రాజమహేంద్రవరం రూరల్,ఆగస్టు 21 :జిల్లాలోని 18 మండలాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎలుకల నివారణ మందులు పంపిణీ చేస్తారని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ రైతులకు బ్రోమోడియోలిన్ మందు ఉచితంగా పంపిణీ చేసేందుకు జిల్లాకు 737 కిలోలు వచ్చిందన్నారు. ఈ మేరకు కలెక్టర్ కరపత్రాలు ఆవిష్కరించారు.

బడి పనులపై దృష్టి సారించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): 'మన బడి మన భవిష్యత్తు' పనుల పురోగతిలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని, పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. జిల్లాలోని 655 పాఠశాలల్లో జరుగుతున్న మన బడి మన భవిష్యత్తు పనులపై బుధవారం సమీక్షించారు. ఇంజనీరింగ్ పనులు పూర్తి చేయడానికి ఐదు శాఖల ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.96.33 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌కు రూ.77.95 కోట్ల చెల్లింపులు పూర్తయ్యాయన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. చేపట్టాల్సిన పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీడీ ఎస్.సుభాషిణి, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎండీ అలిముల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డీ.బాల శంకర్రావు, డీఈవో కె.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 : జిల్లాలో ప్రభుత్వ భూములను అనధికారంగా ఆక్రమించినా..మెరక చేసినా.. మట్టి తవ్వినా చట్ట రీత్యా నేరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ మైనింగ్ చర్యలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిపై గ్రామాల్లో తహశీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎస్‌బీ డీఎస్పీ ప్రభాకర్ బదిలీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌బీ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న డి.ప్రభాకర్ బదిలీ అయ్యారు. డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఆయనను పలమనేరు ఎస్‌డీపీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల కోటాలో ఆయన ఇక్కడికి ఇచ్చారు. ఈ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. కాగా ఈస్ట్ జోన్ డీఎస్పీ కిశోర్ కుమార్ ఏసీబీకి వెళ్లారు. అప్పటి నుంచీ ఆ పోస్టు ఖాళీగా ఉంది. నార్త్ జోన్ ఈ నెలాఖరులో ఖాళీ కానుంది.

డ్వామా పీడీగా శ్రీరాములు నాయుడు

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు21: తూర్పు గోదావరి జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎఫ్‌పీసీ)గా జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీరాములు నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ పీడీగా విధులు నిర్వహిస్తున్న ముఖలింగంను రెగ్యులర్ పోస్టింగ్‌కు (జిల్లా ఎకనమిక్స్ స్టాటస్టికల్ అధికారి)గా రిపోర్టు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీడీకి కార్యాలయ ఏవో కిశోర్, సిబ్బంది పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖలింగంను అకస్మాత్తుగా మార్చడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పోతున్నాయ్.. ప్రాణాలు!



అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదానికి గురైన ఫ్యాక్టరీ

ప్రాణాలు పోతున్నాయి.. పోయేవి కార్మికులవే కదా.. ఫ్యాక్టరీల యాజమాన్యాలివి ఎక్కడైనా ఉన్నాయా?? అందుకే నిర్లక్ష్యం.. బతుకు పోరాటంలో భద్రతలేక ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లాలో వందలాది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.. పరిశ్రమల్లో ఎక్కడైనా ప్రమాదం జరిగితే అధికారులు అప్రమత్తమైపోతారు.. పాలకులు పరుగులు పెడతారు.. ఒకట్రెండు రోజులు హడావుడి చేస్తారు.. ఆ తరువాత షరా మామూలే.. కంపెనీల దారి కంపెనీలదే.. అధికారుల దారి అధికారులదే.. కంపెనీలు ఇచ్చే ఆమ్యామ్యాలకు కార్మికుల భద్రతను తాకట్టు పెట్టేస్తున్నారు.. ప్రత్యేకంగా జిల్లాకో పరిశ్రమల శాఖ అంటూ ఉన్నా ఏనాడు తనిఖీలు చేసిన దాఖలాలే కానరావు.. ఈజ్ ఆఫ్ డూయింగ్ మాటున తనిఖీలకు సంకెళ్లు వేయడంతో యాజమాన్యాల ఇష్టారాజ్యంగా మారింది. దీంతో కార్మికులకు భద్రతే కరువైంది.. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలి.. జిల్లాకు చెందిన కార్మిక శాఖ మంత్రి సుభాష్ ఈజ్ ఆఫ్ డూయింగ్ సంకెళ్లను తెంచి భద్రతపై భరోసా ఇవ్వాలి..

పరిశ్రమల్లో కార్మికులకు అభద్రత

- అచ్యుతాపురం సెజ్ ఘటనతో ఉలికిపాటు
- 18 మంది కార్మికుల దుర్మరణం
- ఉమ్మడి జిల్లాలో చమురు, గ్యాస్ కంపెనీలు
- ఆయా పరిశ్రమల్లో భద్రతపై భయాందోళనలు
- తూతూ మంత్రంగా భద్రత ప్రమాణాలు
- కాకినాడ చుట్టూ పేలుడు ముప్పున్న కంపెనీలు
- ప్రమాదాలు జరిగితే ప్రాణాలు గాలిలోనే
- గత ప్రభుత్వంలో భద్రతా లోపాలపై నివేదికలు
- పలు కంపెనీల్లో నిబంధనల ఉల్లంఘనలు
- ఏ మాత్రం పట్టించుకోని గత పాలకులు
- కొత్త సర్కారు తనిఖీలు చేపట్టాలని డిమాండ్లు
- ఇకనైనా మేలుకోకుంటే ముప్పే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో బుధవారం చోటుచేసుకున్న ఘోర పారిశ్రామిక ప్రమాదంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటనలో ఏకంగా 18 మందికి పైనే కార్మికులు దుర్మరణం పాలవడం పారిశ్రామికవర్గాలను కలవరపాటుకు గురిచేస్తోంది. తాజా ఘటనతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల్లో డొల్లతనం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అరకొర భద్రత మధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికుల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పును ఈ దుర్ఘటన మళ్లీ ప్రశ్నిస్తోంది.

జిల్లాలో ఎన్నో పరిశ్రమలు..

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలు అనేక రకాల పరిశ్రమలకు పెట్టింది పేరు. ముఖ్యంగా కాకినాడ జిల్లా కేంద్రాన్ని ఆనుకుని నగరం చుట్టు పక్కల వందలాది చమురు,రసాయన కంపెనీలున్నాయి. ఇవన్నీ కాకినాడ పోర్టు ద్వారా విదేశాల నుంచి రకరకాల రసాయనాలను దిగుమతి చేసుకుంటాయి.ముఖ్యంగా చమురు పరిశ్రమలైతే విదేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుని బాయిలర్లలో ద్వారా శుద్ధిచేసి అనేక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తాయి. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పారిశ్రామికవాడల్లో పతంజలి, లోహియా ఎడిబుల్ ఆయిల్, కేపీఆర్ ఆగ్రో, శ్రీసాయి ఆయిల్ ఫీల్డ్, శ్రీకాకినాడ ఆక్సిజన్ గ్యాసెస్ ప్రైవేట్ లిమిటెడ్, పట్టాభి ఆగ్రో, ఆపెక్స్ ఫ్రోజెన్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐవోసీ, ఐవోసీఎల్, సంహిత స్టోరేజ్,భారత్ ఎంటర్‌ప్రైజెస్, అదాని ఆగ్రో ఆయిల్, ఎన్ఎఫ్‌సీఎల్, కోరమండల్ వంటి పరిశ్రమలు పనిచేస్తున్నాయి. సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లోను సిరామిక్, ఆగ్రో, ఆక్వా, టైల్స్ తయారీ వంటి పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులు నిరంతరం పనిచేస్తుంటారు. వీరిలో జిల్లాతోపాటు బిహార్, యూపీ, ఒడిషా తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు అధికంగా పనిచేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రసాయన, ఆగ్రో, కోనసీమలో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు, పైపలైన్లు అధికంగా ఉన్నాయి. ఈ పరిశ్రమలు, పైపలైన్లకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలకు దిక్కులేకుండా పోతోంది. తాజాగా బుధవారం పక్కనే ఉన్న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాద ఘటనతో ఉమ్మడి జిల్లాలో గతంలో జరిగిన పారిశ్రామిక ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. కోనసీమ జిల్లాలోని అనేక మండలాల్లో అప్పుడప్పుడు గ్యాస్ పైపలైన్లు లీకై ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నాయి. రామచంద్రపురం, మండపేట, అనపర్తి నియోజకవర్గాల్లోని ఆయిల్,ఆగ్రో పరిశ్రమల్లోను తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అనధికారికంగా తయారుచేసే మందుగుండు పరిశ్రమల్లో ఏటా ఇరవై మందికిపైగా చనిపోతున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో పలు పరిశ్రమల్లో ఎక్కడో ఒక చోట ఏదొక ప్రమాదం జరుగుతూనే ఉంది.ముఖ్యంగా వాకలపూడిలో ఉన్న ఆయిల్ పరిశ్రమలో భద్రత ప్రమాణాలు పాటించడం లేదని ఏడాదిన్నర కిందట అధికారులు తేల్చారు. ఇందులో గనుక ప్రమాదం జరిగితే నగరంలో అర కిలోమీటరు మేర దాని ప్రభావం ఉంటుందని గుర్తించారు. అయినా గత వైసీపీ సర్కారు ప్రమాదాలు పొంచి ఉన్న పరిశ్రమల విషయంలో పెద్దగా చర్యలు తీసుకున్న పాపానపోలేదు. ఆయా కంపెనీల నుంచి మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇప్పించామని గొప్పలు చెప్పడం, ఆ ముసుగులో కంపెనీలను బెదిరించి తాము కొంత దండుకోవడం మినహా కార్మికుల భద్రతకు గట్టిగా వ్యవహరించలేదు.

నాడు లోపాలు గుర్తించినా..

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదం తరహా ఘటనలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గడిచిన కొన్నేళ్లలో అనేకం చోటుచేసుకున్నాయి. ప్రధానంగా 2021లో కాకినాడలో సర్పవరం టైకీ రసాయన పరిశ్రమలో బాయిలర్ పేలిన ఘటనలో ఇద్దరు సజీవ దహనమయ్యారు. ఆ తర్వాత 2022లో ప్యారీ షుగర్స్ ఫ్యాక్టరీలో జరిగిన వరుస ప్రమాదాల్లో ఐదుగురి దేహాలు నుజ్జునుజ్జయ్యాయి. గతేడాది మార్చిలో పెద్దాపురం అంబటి ఆయిల్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఏకంగా ఏడుగురు కార్మి కులు దుర్మరణం చెందారు.అలాగే 2014 జూన్‌లో కోనసీమలోని నగరంలో గెయిల్ గ్యాస్‌పైపులైన్ పేలుడులో 15 మంది దుర్మరణం పాలయ్యారు. ఇలా అనేక ప్రమాదాల్లో ఎందరో చనిపోయారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలోని ఎల్జీపాలిమర్స్ గ్యాస్ లీకు దుర్ఘటన జరగడంతో 2020 మేలో ప్రభుత్వం అన్ని జిల్లాల్లో పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల డొల్లతనంపై తనిఖీలకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోను అప్పటి జేసీల నేతృత్వంలో ఫ్యాక్టరీలు, పరిశ్రమలు, ఫైర్, కాలుష్య నియంత్రణ బోర్డు తదితర శాఖలతో కూడిన అధికారుల బృందం జిల్లాలోని పరిశ్రమల్లో భద్రత లోపాలు, ప్రమాదాలు జరిగితే ప్రాణ నష్టం నివారించే వ్యవస్థలు ఉన్నాయో లేవో తనిఖీలు చేసింది. ఇరవై అంశాల్లో తనిఖీలు చేసి నివేదికలు తయారు చేశారు. ఇందులో పలు పరిశ్రమలు ప్రమాదాల నివారణకు కనీస చర్యలు తీసుకోవడం లేదని గుర్తించారు. కోనసీమలో అనేక గ్యాస్ పైపులైన్ల ద్వారా పొంచి ఉన్న ముప్పును గుర్తించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సర్కారుకు సిఫార్సులు చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం ఆ తర్వాత నివేదికలను గాలికొదిలేసింది. గతేడాది పెద్దాపురం అంబటి ఆయిల్ ఫ్యాక్టరీ దుర్ఘటన తర్వాత ఉమ్మడి జిల్లాలో అనుమతులు లేని, భద్రత చర్యలు పాటించని కంపెనీల పైనా తనిఖీలు చేపట్టారు. ఇందులో కొన్ని అత్యంత ప్రమా దకర కంపెనీలను గుర్తించారు. వీటిలో కార్మికుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని నిగ్గుతేల్చారు. కానీ ఆ కంపెనీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దాంతో పరిస్థితి మొదటికొచ్చింది.

కూటమి ప్రభుత్వం మేల్కొనాలి..

అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన దుర్ఘటనను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వం పరిశ్రమల్లో భద్రత వ్యవహారాలను మరింత పెంచేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. జిల్లాలో అత్యంత ప్రమాదకర పరిశ్రమల్లో పొంచి ఉన్న ప్రమాదాలు, తీసుకోవాల్సిన భద్రత చర్యలు, పేలుళ్ల నివారించడానికి ఆయా కంపెనీల సన్నద్ధత ఏ విధంగా ఉందో పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఫ్యాక్టరీలు, పరిశ్రమల్లో ప్రమాద నివారణ వ్యవస్థలు, మాక్‌డ్రిల్స్ జరుగుతున్నాయా? లేదా? రియాక్టర్లు, బాయిలర్స్ పేలుడు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మరింత అప్రమత్తత ఏ స్థాయిలో ఉందో సమీక్షించాల్సిన అవసరం ఏర్పడింది.

పాశర్లపూడిలంక వాసి మృతి



మామిడికుదురు, ఆగస్టు 21: అనకాపల్లిలో ఫార్మా కంపెనీలో బుధవారం మధ్యాహ్నం జరిగిన పేలుడు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలంక గ్రామానికి చెందిన మారిశెట్టి సతీష్ (31) మృతిచెందినట్టు సమాచారం. నాలుగేళ్లుగా సతీష్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడికి మూడేళ్ల క్రితం సాయిశ్రీ వినాయక దుర్గా వెంకట నాగమణితో వివాహమైంది. సతీష్ తండ్రి శ్రీను కొబ్బరి పీచుతో మ్యాట్‌లు తయారుచేసి విక్రయిస్తుంటాడు. తల్లి పద్మావతి గృహిణి. సమాచారం తెలియడంతో తల్లిదండ్రులు, భార్య ఇక మాకు దిక్కెవరంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



అనపర్తి శ్రీచక్ర ఆయిల్స్‌లో ప్రమాదం (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రమాదాలు

- అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన తరహా ప్రమాదం 2021లో కాకినాడ నగరం సర్పవరం టైకీ రసాయన పరిశ్రమలో జరిగింది. బాయిలర్ పేలిన ఘటనలో ఇద్దరు సజీవ దహనం కాగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- 2022 ఆగస్టు 19న కాకినాడను ఆనుకుని ఉన్న ప్యారీ షుగర్ ఫ్యాక్టరీలో విస్ఫోటనం చోటుచేసుకుంది. లోపల బాయిలర్ పేలడంతో ముగ్గురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు.తిరిగి ఆగస్టు 29న ఇదే ఫ్యాక్టరీలో రెండోసారి మూడో అంతస్తులో యంత్రం నుంచి ఓ పైప్ కింద పడిపోవడంతో ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు.
- గతేడాది అంటే 2023 ఫిబ్రవరి9న పెద్దాపురం అంబటి ఆయిల్ పరిశ్రమలోఇరవై అడుగులకుపైగా ఎత్తున్న పొడవాటి ఆయిల్ ట్యాంకులోకి శుభ్రం చేయడానికి దిగి మడ్డిలో ఇరుక్కుని దుర్మరణం పాలయ్యారు.
- 2014లో కోనసీమలోని నగరంలో గెయిల్ పైపులైన్ పేలుడు ఘటనలో 15మంది దుర్మరణం పాలయ్యారు.
- 2019లో తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పీరారామచంద్రపురంలో శ్రీచక్ర ఆయిల్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో రూ.25 కోట్లు నష్టం వాటిల్లింది. ప్రాణనష్టం సంభవించలేదు.
- 2022లో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారు కొండగూడెంలో ఉన్న విజన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు.

వర్గీకరణం!

జిల్లాలో బంద్ ప్రశాంతం

- ఎస్సీ వర్గీకరణ తీర్పు వ్యతిరేకిస్తూ నిరసన
- బస్టాండ్ ఎదుట హర్షకుమార్ ఆందోళన
- గామన్ బ్రిడ్జిపై జీవీ శ్రీరాజ్ ధర్నా
- అదుపులోకి తీసుకుని.. విడుదల
- కాసేపు స్తంభించిన ట్రాఫిక్
- షాపులు మూయించిన నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ చేపట్టిన బంద్ జిల్లాలో విజయవంతమైంది.బంద్‌కు విద్యా, వ్యాపార సం స్థలు స్వచ్ఛందంగా సహకరించాయి. మాలసంఘాలు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి , బీఎస్పీ, కాంగ్రెస్, దళిత ఐక్యవేదిక, జనతా ప్రజాతంత్ర్య పార్టీ, మాలమహానాడు, ఎస్సీ సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ బంద్ సాగింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జిల్లాలోని రాజమహేంద్రవరం కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, సీతానగరం, గోపాలపురం, దేవరపల్లి, పెరవలి, ఉండ్రాజవరం తదితర మండలాల్లో బంద్ ప్రభావం కనిపించింది. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ ఎంపీ హర్షకుమార్ మంగళవారం అర్ధరాత్రి దాటాక రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుని అక్కడే ఉండిపోయి బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 6:45 గంటల వరకు ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు.దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రకాష్ నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హర్షకుమార్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అటుపై బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. హర్షకుమార్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించి అక్కడ నుంచి ఆయన నివాసానికి చేర్చారు. వర్గీకరణ తీర్పు ఉపసంహరించే వరకు పోరా టం ఆగదని హర్షకుమార్ స్పష్టం చేశారు. హర్షకుమార్ తనయుడు జీవీ శ్రీరాజ్ మరికొంత మంది యువకులు కాతేరు శివారు గామన్ బ్రిడ్జిపైకి చేరి ధర్నా చేశారు. దంతో విజయవాడ జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి అటుపై ఇంటికి చేర్చారు. మాల సం ఘాల నాయకులు నిరసన ర్యాలీలు చేశారు. గోకవరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి నిరసన ర్యాలీగా బయలుదేరి పుష్కరాల రేవు, మెయిన్ రోడ్డు, శ్యామల సెంటర్ మీదుగా తిరిగి బైపాస్ రోడ్డు,కంబాలచెరువు మీదుగా లాలా చెరువు సెంటర్‌కు చేరుకున్నారు. మార్గమధ్యలో మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అక్కడక్కడా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలను, తెరిచి ఉన్న దుకాణాలను మూయించారు. లాలాచెరువు సెంటర్‌లో సుమారు అరగంట పాటు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. వర్గీకరణకు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



రాజమహేంద్రవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి దళిత నాయకుల నినాదాలు





ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద హర్షకుమార్,నాయకుల ధర్నా

జీవీ శ్రీరాజ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ

పటిష్ట బందోబస్తు : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): భారత్ బంద్ పిలుపు సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అందుబాటులో ఉన్న సిబ్బంది అందరినీ వివిధ ప్రాంతాల్లో మోహరించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. అసాంఘిక వ్యక్తుల కదలికలు, సమ స్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలను పంపించడం జరిగిందన్నారు.హైవేలపై దృష్టి సారించా మని చెప్పారు. జనజీవనానికి ఆటంకం లేకుండా చూశామన్నారు.

34 ప్రైవేట్ హాస్టల్స్ తనిఖీ

కనీస సౌకర్యాల్లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 21 : జిల్లా వ్యాప్తంగా అనేక ప్రైవేట్ వసతిగృహాలు, చైల్డ్ కేర్ సెంటర్లు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించడంలేదని అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వివిధ సంక్షేమశాఖల అధికారుల వసతిగృహాలు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను, పిల్లల సంరక్షణ కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మంగళవారం 19 చోట్ల, బుధవారం 15 చోట్ల వసతిగృహాలను తనిఖీ చేసి అక్కడి వసతులను, రికార్డులను పరిశీలించారు. కొన్ని ప్రైవేట్ వసతిగృహాలకు ప్రభుత్వ అనుమతులు లేకపోవడాన్ని గుర్తించారు. రాజమహేంద్రవరం అర్బన్ సచివాలయంలో ఒక ప్రైవేట్ వసతిగృహం నమోదు చేసుకున్నట్టు తనిఖీల్లో వెలుగు చూసింది. కొన్ని వసతిగృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, కొన్ని భవనాలు నివాసయోగ్యంగా లేకపోవడం వెల్లడైంది. జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి కేఎన్ జ్యోతి, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి శశాంక, ఇన్‌ఛార్జి ఐసీడీఎస్ అధికారిణి కె.నాగలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి ఎం.సందీప్, అనుబంధ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి తనిఖీలు జరిపారు. కలెక్టర్‌కు నివేదిక అందించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటన విడుదల చేశారు. అనధికార వసతిగృహాలకు ఇళ్లను ఇస్తే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, వసతిగృహాల విషయంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ప్రైవేట్ వసతిగృహాల నిర్వాహకులు తగిన అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడం, పిల్లల సంరక్షణ కేంద్రాల మార్గదర్శకాలు పాటించకుండా నిర్వహించడాన్ని తనిఖీ అధికారుల బృందం గుర్తించడం జరిగిందని తెలిపారు. నిర్వాహకులు తప్పనిసరిగా మార్గదర్శకాలు పాటించాలని, అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న వసతిగృహాలపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.



ప్రైవేట్ హాస్టళ్లలో విద్యార్థినులను ప్రశ్నిస్తున్న అధికారులు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

వాహనాలను అడ్డగించి డబ్బులు డిమాండ్ చేస్తున్న ముఠా అరెస్టు

దేవరపల్లి, ఆగస్టు 21 : గుండుగోలను కొవ్వూరు జాతీయ రహదారిపై పశువులు రవాణాచేస్తున్న వాహనాలను అడ్డగించి డబ్బులు డిమాండ్ చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు దేవరపల్లి సీఐ బాల సురేష్ తెలిపారు. దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద బుధవారం తెల్లవారుజామున 4-30కు ఆవులు రవాణా చేస్తున్న బొలేరో వ్యాన్, ఇన్నోవా కారును పోలీసుల సైరన్ వేసుకుని ఏడుగురు వ్యక్తులు అడ్డగించారు. వాహనదారులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. బొలేరో డ్రైవర్‌ను రూ.25 వేలు నగదు డిమాండ్ చేయడంతో తనవద్ద ఉన్న రూ.2వేలు ఇవ్వగా, మిగిలిన సొమ్ము ఫోన్ పే చేయాలని నిర్బంధించారు. నిందితులు రాజమహేంద్రవరంనకు చెందిన సిర్రా జార్ఖండ్ ప్రిన్స్, గెల్లా సజని, గెల్లా వినేష్, వేమగిరికి చెందిన శ్రావణ్య, సాయి, సంతోష్, చిరులుగా గుర్తించామన్నారు. వీరిలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు పరారీ అయ్యారన్నారు. అదుపులోకి తీసుకున్న వారిని ప్రశ్నించగా అంతకు ముందు పశువులు రవాణాచేస్తున్న బొలేరో వాహన డ్రైవర్ నుంచి రూ. 15 వేలు ఫోన్ పే ద్వారా తీసుకున్నామని చెప్పారన్నారు. జాతీయ రహదారిపై పశువుల రవాణా చేస్తున్న వాహనదారులను బెదిరించి డబ్బు డిమాండ్ చేయడంపై కేసునమోదు చేసినట్లు సీఐ బాలసురేష్, ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తిపై కేసునమోదు

కొవ్వూరు, ఆగస్టు 21 : అంగన్వాడీలను ఫుడ్ ఆఫీసర్ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.జి.ప్రకాష్ తెలిపారు. ఈనెల 8న గుర్తు తెలియని వ్యక్తి నలుపురంగు బైక్‌పై కొవ్వూరు మండలం ఆరికిరేవుల, పంగిడి, వాడపల్లి, చాగల్లు గ్రామాల్లో అంగన్వాడీ సెంటర్‌లకు వచ్చాడు. నేను ఫుడ్ ఆఫీసర్‌ని కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చాను అని చెప్పి అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. పిల్లలకు అందించే ఆహారం నాణ్యత బాగాలేదని అంగన్వాడీ సిబ్బందిని కించపరిచే విధంగా దుర్భాషలాడుతూ మీరు ఎలా ఉద్యోగం చేస్తారు అంటూ బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై కొవ్వూరు ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పురస్కరించుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

లస్కర్‌ను సత్కరించిన పసలపూడి రైతులు



లస్కర్ చిక్కాల సత్యనారాయణను సత్కరిస్తున్న రైతులు

ఉండ్రాజవరం, ఆగస్టు 21 : మండలంలోని పసలపూడి ఇరిగేషన్ లాక్ లస్కర్ చిక్కాల సూర్యప్రకాశరావును కాలువ పరిధిలోని వేలివెన్ను, కాల్ధరి, పసలపూడి, వడ్లూరు గ్రామాలకు చెందిన రైతులు బుధవారం లాకు వద్ద శాలువ కప్పి సత్కరించారు. కాలువ అభివృద్ధి పనులకు సహకారం అందించడంతో పాటు రైతులకు అందుబాటులో ఉండి అందిస్తున్న సహకారాన్ని పురష్కరించుకుని సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

'చిన్నతనం నుంచి పిల్లలకు సేవాభావాన్ని అలవర్చాలి'



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కొవ్వూరు, ఆగస్టు 21: చిన్నతనం నుంచి పిల్లలకు సేవాభావాన్ని అలవర్చాలని కొవ్వూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ అన్నారు. బుధవారం మద్దిపాటి సత్యనారాయణ కుమార్తె నాగలలిత హాసిని పుట్టినరోజు వేడుకలను కొవ్వూరు మండలం ఆరికిరేవుల ఎంపీపీ-1 పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యనమదల సుబ్రహ్మణ్యం, కంటమణి రామకిషోర్, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మహ్మద్ హుస్సేన్, నాళం ఎనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ముప్పిడి



సీఎం చంద్రబాబును కలిసి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 21 : కొవ్వూరు నియోజకవర్గంలో సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం రాజధాని అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు ఛైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

ఆశా కుటుంబాన్ని ఆదుకున్న వైద్య సిబ్బంది



ఆశా వర్కర్ జ్యోతి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న వైద్య సిబ్బంది

నల్లజర్ల, ఆగస్టు 21: నల్లజర్ల మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఆశా వర్కర్ వల్లుబోయిన జ్యోతి కుటుంబానికి తోటి వైద్య ఉద్యోగులు ఆర్థికంగా ఆదుకునేందుకు అండగా నిలిచారు. ఆశా వర్కర్ జ్యోతి భర్త శ్రీనివాస్‌కు ఇటీవల తీవ్ర అనారోగ్యంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఆశా వర్కర్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు సమిష్టిగా ముందుకు వచ్చి డాక్టర్ తెల్లం గంగాధర్ చేతుల మీదుగా రూ.26,500 ఆర్థిక సహాయాన్ని ఆశావర్కర్‌కు అందించారు. కార్యక్రమంలో వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వి.వి. ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు ఎస్ఐగా నరేంద్ర



చాగల్లు, ఆగస్టు 21 : చాగల్లు ఎస్ఐగా కె. నరేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ జిల్లా ఇంటెలిజెన్సు విభాగంలో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ పి.నాగరాజు తాడేపల్లిగూడెం రూరల్‌కు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రధాన్యం ఇస్తామన్నారు. ప్రజలు కోడిపందాలు, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు.

సంస్కార భారతి ఆధ్వర్యంలో బాలగోకులం

కొవ్వూరు, ఆగస్టు 21 : కొవ్వూరు పురుషోత్తమ రామమందిరంలో శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 25న ఉదయం 9 గంటలకు సంస్కార భారతి కొవ్వూరుశాఖ ఆధ్వర్యంలో బాలగోకులం నిర్వహిస్తున్నట్లు టీఎస్‌వీ రమణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో 5 సంవత్సరాలలోపు పిల్లలకు శ్రీకృష్ణుని వేషధారణ చేసి తీసుకుని రావాలన్నారు. వేషధారణలో వచ్చిన చిన్నారులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా బంద్ ప్రశాంతం



కొవ్వూరు విజయవిహార్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో షెడ్యూల్ కులాల ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి

● మాలమహాసభ జాతీయ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్

కొవ్వూరు, ఆగస్టు 21: వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో షెడ్యుల్ కులాల ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని మాలమహాసభ జాతీయ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ అన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణపై ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాల సంఘాల జేఏసీ, మాలమహాసభ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కొవ్వూరు పట్టణంలో భారత్‌బంద్ నిర్వహించారు. ఉదయం ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, బ్యాంకులు, పాఠశాలలను మూయించి వేసి నిరసన తెలిపారు. మెరకవీధి అంబేద్కర్ విగ్రహం నుంచి పట్టణ పురవీధులలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బొంతా శ్యాం రవిప్రకాష్ మాట్లాడుతూ ఆర్టికల్ 341 ప్రకారం ఏదైనా ఒక కులాన్ని షెడ్యుల్ కలాల జాబితాలో చేర్చాలన్నా లేదా తీసివేయాలన్నా పార్లమెంటుకు మాత్రమే అధికారం ఉందన్నారు. రిజర్వేషన్ తగ్గించే అధికారం పార్లమెంటుకు లేదన్నారు. ఆర్టికల్ 442 ప్రకారం షెడ్యుల్‌ట్రైబుల్ (ఎస్టీ) జాబితాలో చేర్చాలన్నా లేదా తీసివేయాలన్నా పార్లమెంటుకు మాత్రమే అధికారం ఉందన్నారు. రాష్ట్రంలో ఏదైనా ఒక కులాన్ని షెడ్యుల్‌క్యాస్ట్, షెడ్యుల్‌ట్రైబులో కలపాలంటే నోటిఫైచేసి పార్లమెంటు పంపిస్తే అక్కడి నుంచి రాష్ట్రపతికి పంపించాలన్నారు. ఎస్సీలను వర్గీకరించే అధికారం రాష్ట్రపతికి లేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఆగస్టు 1వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఎస్టీల గురించి అడగకపోయినా ఎస్సీ, ఎస్టీలకు క్రిమిలేయర్ వర్తిస్తుందని పేర్కొనడం దుర్మార్గమన్నారు. అస్పృశ్యత ఆధారంగా ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించామని, నేడు ఆ రిజర్వేషన్లు ఎత్తివేయడానికి కుట్ర జరుగుతుందన్నారు. కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహాసభ జాతీయ అధ్యక్షుడుమల్లెల వెంకట్రావు సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేశామన్నారు. భారత్‌బంద్‌కు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బావన రాజేష్ (బెన్ని), మాసా ఆనంద్, తరిపే బంగారయ్య, గోశాల శ్రీనివాసరావు, మూసిగంటి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు. బంద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ జి.దేవకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహన్‌లు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

బంద్ పాక్షికం

చాగల్లు: ఎస్సీల వర్గీకరణను వ్యతిరేస్తూ మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రమైన చాగల్లులో వర్గీకరణ వ్యతిరేక సమితి, జేఏసీల ఆధ్వర్యంలో యువకులు బైక్‌లపై ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. వర్గీకరణ వద్దు, ఐక్యత ముద్దు అంటూ నినాదాలు చేశారు. సుప్రీమ్ కోర్టు ఈవిషయంపై పునరాలోచించాలని ఉద్యమకారులు కోరారు. ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలు పనిచేయలేదు. వాణిజ్య సంస్థలు, బ్యాంకులు యథావిధిగా పనిచేశాయి.



తాళ్ళపూడి బస్టాండ్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దళిత నాయకులు



ఉండ్రాజవరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



గౌరీపట్నం రహదారిపై ఆందోళన చేస్తున్న మాలమహానాడు నాయకులు



గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్‌లో నిరసనకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ సతీష్‌కుమార్

తాళ్ళపూడి: దేశంలోని మాల మాదిగలను కులాల ప్రాతిపదికన విడదీస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా సుప్రీంకోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణను ఏర్పాటుచేసిన విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని, వర్గీకరణను రద్దు చేయాలని పలువురు దళిత నాయకులు అన్నారు. తాళ్ళపూడి మండలంలో భారత్ బంద్ ప్రకటించిన నేపథ్యంలో దళిత నాయకులు ఆధ్వ ర్యంలో ఎస్సీ వర్గీకరణ ర్యాలీ, బంద్‌ను నిర్వహించారు. తాళ్ళపూడి, ప్రక్కిలంక గ్రామాలలోని అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించి తాళ్ళపూడి బస్టాండ్ సెంటరులో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు మూయించి వేశారు. ఈ కార్యక్రమంలో యాళ్ల బాబూరావు, గూడా విజయరాజు, గండి రాంబాబు, దాకే రాజు, పిట్టా శ్రీను, బట్టు సుద్దారావు, యాళ్ళ సునీల్, దళిత నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : ఉండ్రాజవరం మండలంలో ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా వివిధ మాలసామాజిక సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. సంఘ నాయకులు పాఠశాలలను, ప్రభుత్వ కార్యాలయాలను మూయించి వేశారు. మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో నిరసన చేశారు. ఉండ్రాజవరం అంబేద్కర్ కల్చర్ యూనియన్ తరపున తహసిల్దార్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా వినతిప త్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గాడి క్రిష్టాఫర్, నీరుళ్ల విజయకుమార్, గాడి నరసింహరాజు, మర్రి అంబేద్కర్, తప్పెట్ల శేషగిరి, నూకపెయ్యి టోని పాల్గొన్నారు.

దేవరపల్లి: వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న భారత్‌బంద్‌లో భాగంగా బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ షాపులు, విద్యాసంస్థలను మూయించి వేశారు. గౌరీపట్నంలోని మాలమహానాడు నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఆధ్వర్యంలో వర్గీకరణ వద్దు దళితుల ఐక్యతే ముద్దు అంటూ నినాదాలు చేశారు. బందు ప్రశాంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సోమరాజు, ఎన్.శేఖర్, ప్రభాకర్, కే.రమేష్, ఎన్.సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం : ఏ,బీ,సీ,డీ వర్గీకరణపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్ణయాధికారం చేయాలని దేశ ఉన్నత న్యాయస్థానం క్రిమిలేయర్ విధానాన్ని వ్యతి రేకిస్తూ గోపాలపురంలో మాలమహానాడు నాయకులు చేపట్టిన బంద్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 9గంటల నుంచి ప్రధాన సెంటర్‌లో వర్తక వ్యాపార దుకాణాలను, ప్రభుత్వ కార్యాలయాలను మూయించారు. అనంతరం చెక్‌పోస్టు సెంటర్‌వద్ద కొద్దిసేపు బైటాయించారు. బందు ప్రశాంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తలారి చందు, దాసరి రవి, చోళ శ్రీనివాసరావు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ వద్దు.. ఐక్యత ముద్దు

నల్లజర్ల: వర్గీకరణ వద్దు ఐక్యతే ముద్దు అని అంబేద్కర్ యూత్ సభ్యులు గుదే సుబ్బారావు, మన్నే రాంబాబు అన్నారు. బుధవారం అఖిత భారత్ బంద్ సందర్భంగా పలు పాఠశాలలను, బ్యాంకులను, ప్రభుత్వ కార్యాలయాలను మూసి వేసి నల్లజర్ల సెంటర్‌లో రాస్తోరోకో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతాప్, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బంద్ నిర్వహణ అంబేద్కర్ స్ఫూర్తికి విరుద్ధం

● ఎమ్మార్పీఎస్ నాయకుడు గెడ్డం వినోద్ మాదిగ

తాళ్ళపూడి, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్ నిర్వహణ అంబేద్కర్ స్ఫూర్తికి విరుద్ధమని ఎమ్మార్పీఎస్ నాయకుడు గెడ్డం వినోద్ మాదిగ బుధవారం తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామంలో ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంఘాల నాయకులు భారత్ బంద్ పిలుపు నేపథ్యంలో చేపట్టిన కార్యక్రమాలను ఎమ్మార్పీ ఎస్ నాయకులు గెడ్డం వినోద్ మాదిగ వ్యతిరేకిస్తూ స్పందించా రు. దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఎస్సీ ఉపవర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని కోర్టు తీర్పులు రాజ్యాంగానికి లోబడి ఉంటాయని వారు గ్రహించాలని తెలిపారు.

దేశాభివృద్ధికి గ్రామాలు పట్టుగొమ్మలు

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



మండల సర్పంచ్‌లు, కార్యదర్శులతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

నల్లజర్ల, ఆగస్టు 21 : దేశాభివృద్ధికి గ్రామ పంచాయతీలు పట్టుగొమ్మలు అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో మూడురోజుల క్రితం ప్రారంభమైన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్యం మెరుగుపర్చి ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీలు సమిష్టిగా కృషిచేసి వ్యర్థాల నుంచి సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చేయాలన్నారు. ప్రజలకు సురక్షిత మంచినీరు అందించే విధంగా ప్రతి 15 రోజులకు వాటర్ హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రైవేటు వసతి గృహాల తనిఖీ



ప్రైవేటు వసతి గృహాలను తనిఖీ చేస్తున్న స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి నాగలక్ష్మి

కొవ్వూరు, ఆగస్టు 21 : ప్రైవేటు వసతి గృహాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు మౌళిక సదుపాయాలు కల్పించాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిని కె.నాగలక్ష్మి అన్నారు. బుధవారం కొవ్వూరు నియోజకవర్గ పరిధిలోని కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో ప్రైవేటు వసతిగృహాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కొవ్వూరు రైల్వేస్టేషన్‌రోడ్‌లోని మదర్‌థెరిస్సా షెల్టర్ హోమ్, తాళ్లపూడి మండలం గజ్జరంలో హోప్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోమ్, మలకపల్లిని అవిలా చిల్డ్రన్స్ హోమ్, ఆరికిరేవులలో క్రిస్టియన్ చారిటబుల్ సొసైటీ వసతి గృహాలను తనిఖీ చేశారు. నాగలక్ష్మి మా ట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు వసతి గృహాలలో వసతులు, మౌళిక సదుపాయాలు, పిల్లల సంఖ్య, హాజరు నమోదు వంటి వివరాలను పరిశీలించామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసతిగృహ నిర్వహణ ఉండాలన్నారు. పిల్లల భద్రత, పరిసరాల పరిశుభ్రత, శుభ్రమైన తాగునీరు, శానిటేషన్‌ను తనిఖీ చేశామన్నారు. వంటశాలలు పరిశీలించి సూచనలు చేశామన్నారు. వసతి గృహాలవద్ద సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

పెరవలి, ఆగస్టు21 : గోదావరి వరద మళ్లీ పెరుగుతుంది. గత నాలుగైదు రోజులుగా ఇసుక మేటలు తేలి అంతంతమాత్రంగా ఉన్న గోదావరి వరద గత రెండు రోజులుగా పెరిగింది. ఎగువభాగంలో కురుస్తున్న వర్షాలవల్లే ఈ విధంగా వరదనీరు వచ్చినట్లు భావిస్తున్నారు.

తీపర్రు వద్ద గోదావరి వరద



పెరవలిలో కొవ్వొత్తుల ర్యాలీ



పెరవలి, ఆగస్టు21 : ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పెరవలిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ చేశారు. దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు.

పెరవలిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నదృశ్యం

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణ తరగతులు



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచులు, కార్యదర్శులు

తాళ్ళపూడి, ఆగస్టు 21 : మండలంలో చేపట్టిన సర్పంచ్‌ల శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. శిక్షణా కార్యక్రమంలో ట్రైనీలుగా కార్యదర్శులు ఆశా అలేఖ్య, సువర్ణలు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పంచాయతీల ఆదాయ వనరులు పెంచుకుంటూ గ్రామాల అభివృద్ధికి దోహద పడేలా పరిపాలన సాగించాలని, పలు విధి విధానాలపై సూచనలు చేశారు. చివరిరోజున శిక్షణా కార్యక్రమం అనంతరం సర్పంచ్‌లకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డీ వీరన్న పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పలువురు టీడీపీ నాయకుల కుటుంబాలకు పరామర్శ

తాళ్ళపూడి, ఆగస్టు 21 : తాళ్ళపూడి మండలంలోని పెద్దేవం, తిరుగుడుమెట్ట గ్రామాలలోని ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుల కుటుంబాలను టీడీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అల్లూరి విక్రమాధిత్య, టీడీపీ యువగళం సభ్యులు పరామర్శించారు. పెద్దేవం గ్రామంలో మద్దుకూరి గంగాధర్ కుటుంబాన్ని, తిరుగుడుమెట్ట గ్రామంలోని ఇల్లూరి బాబ్జి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణేష్, అన్నమరెడ్డి సత్తిబాబు, సోమరాజు, ఎల్లిన కాశీ, బోడపాటి కాశీ, కొర్లపాటి దత్తుడు, అనపర్తి ప్రసాదు, ఇంజరపు అబ్బులు, సువ్వడ రమణ, ఉప్పే బంగారం, మద్దుకూరి వెంకటేష్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తు అల్లూరి విక్రమాధిత్య, యువగళం టీం

జనసేనలో భారీ చేరికలు



చీపురుగూడెం నుంచి జనసేనలోకి చేరిన కార్యకర్తలు

నల్లజర్ల,ఆగస్టు 21 : నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన పలువురి జనసేనలో చేరినట్లు పార్టీ అధ్యక్షుడు జీ.వరుణ్‌కుమార్, మండల కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు పేర్కొన్నారు. బుధవారం దేవరపల్లిలో నియోజక వర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు ఆధ్వర్యంలో జనసేనలోకి భారీ చేరికలు జరిగాయని చెప్పారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరాజు వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. తలంశెట్టి గంగరావు,తలంశెట్టి కృష్ణ,గుడెపు దుర్గారావు, కోటారి సుబ్బారావు, చెల్లు సామేలు, తలంశెట్టి సాయి, సీతరామయ్య లక్ష్మినరసమ్మ పాటు మరో నలుగురు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

అనుమతి లేకుండా విగ్రహాల ఏర్పాటు తగదు

చాగల్లు, ఆగస్టు 21: మండలంలో ముందస్తు అనుమతులు లేకుండా ఎటువంటి విగ్రహాలు ఏర్పాటు చేయకూడదని తహసీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం విడుదలచేసిన ప్రకటనలో అనుమతిలేని విగ్రహాలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపక శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 21 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బ్యాంకింగ్ ఫైనాన్స్ అండ్ ఇన్స్యూరెన్స్ కోర్సుపై మూడు రోజుల అధ్యాపక శిక్షణ బుధవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారు. విద్యార్థుల్లో వ్యవస్థాపక నైపుణ్యాలు ఉద్యోగ అవకాశాలు పెంపొందించడానికి అధ్యాపకులకు ఈ శిక్షణ ఎంతో ఉపకరిస్తుందని, వివిధ కళాశాలల నుంచి అధ్యాపకులు హాజరవుతున్నారని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఏపీఎస్‌సీహెచ్‌ఈ, సీఆర్ఐఎస్‌పీ, కళాశాల ఉన్నత విద్యా శాఖ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తున్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1	ఇంద్ర, మిస్టర్ బచ్చన్
వై.స్ర్కీన్ 2	తంగలన్
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
రాధాకృష్ణ	ఆయ్, తంగలన్
శ్రీగణపతి	డబుల్ ఇస్మార్ట్
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్